ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

నంద్యాల

జిల్లా వార్తలు 5

ఆదివారం 18 ఫిబ్రవరి 2024





వైసీపీ సభకు బడి బస్సులు..!

విద్యా విధానంలో విప్లవాత్మక మార్పులు తెచ్చామంటూ గొప్పలు చెప్పుకునే సీఎం జగన్... విద్యార్థుల బస్సులను తన రాజకీయ ప్రయోజనాలకు వాడుకుంటున్నారు. పార్టీ కార్యక్రమానికి స్కూల్ బస్సులను తరలిస్తూ విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. స్కూల్ బస్సులు విద్యార్థుల కోసమే వినియోగించాలన్న నిబంధనలు ఉన్నప్పటికీ జగన్ కోసం రవాణా శాఖ అధికారులు ఆ రూల్స్‌ను పక్కన పెట్టేశారు. 18వ తేదీ ఆదివారం అనంతపురం జిల్లా రాప్తాడులో జరిగే సీఎం జగన్ 'సిద్ధం' కార్యక్రమానికి స్కూల్ బస్సులను తరలిస్తున్నారు. వాటితోపాటు ఆర్టీసీ బస్సులను కూడా ముందస్తుగానే సిద్ధం చేసుకున్నారు. ఇలా స్కూల్ బస్సులను విద్యార్థుల కోసం కాకుండా స్వప్రయోజనాల కోసం వినియోగించడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

- అనంతపురం సీఎం సభకు పంపాలంటూ యాజమాన్యాలకు ఆదేశం
- వైసీపీ ప్రచార సభ సేవలో రవాణా శాఖ
- ఆర్టీసీ బస్సులూ 'సిద్ధం' సభకు
- విద్యార్థులు, ప్రయాణికులకు తిప్పలే..

ఆత్మకూరు, ఫిబ్రవరి 17: ఎన్నికల సమీపిస్తుండటంతో అధికార వైసీపీ తలపెట్టిన రాజకీయ ప్రచారాల్లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా పలు చోట్ల సిద్ధం సభలకు శ్రీకారం చుట్టింది. సీఎం జగన్ హాజరయ్యే ఈసభలకు ఆయా జిల్లాల నుంచే కాకుండా ఇతర జిల్లాల నుంచి జనాన్ని తరలించేందుకు ఆపార్టీ చేస్తున్న ప్రయత్నాలు అన్నీఇన్నీ కావు. దీనివల్ల సామాన్య ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతాయన్న విషయం తెలిసినప్పటికీ ఎన్నికల వేళ తమ ఉనికిని చాటుకునేందుకు వైసీపీ ప్రయత్నాలు చేస్తోంది. ఈనెల 18వ తేదీన అనంతపురం జిల్లా రాప్తాడులో అధికార వైసీపీ సిద్ధం సభను తలపెట్టింది. ఈసభకు సీఎం జగన్ రానుండటంతో రాయలసీమ జిల్లాల నుంచి జనాన్ని తరలించేందుకు అధికార వైసీపీ చేయని ప్రయత్నం లేదు. అయితే సిద్ధం సభకు జనాన్ని తరలించేందుకు ప్రైవేట్ స్కూల్ బస్సులను వినియోగించడం విమర్శలకు తావిస్తోంది. పైగా ఈ వ్యవహారానంతా రవాణా శాఖ అధికారులకు అప్పగించడంతో వారే స్వయంగా రంగంలోకి దిగి ప్రైవేట్ స్కూల్ బస్సులను సిద్ధం చేశారు. ఇందులో భాగంగా ఆత్మకూరులో 29, నందికొట్కూరులో 35, పాములపాడులో 9, వెలుగోడులో 13 స్కూల్ బస్సులను ఏర్పాటు చేసేందుకు రవాణా అధికారులు కసరత్తు చేశారు. స్కూల్ బస్సుల నిబంధనలను కఠినంగా అమలు చేయాల్సిన రవాణా అధికారులే వైసీపీ కోసం నిబంధనలకు పాతర వేయడం విమర్శలకు తావిస్తోంది.

బస్సుల నంబర్లు, డ్రైవర్ల ఫోన్ నంబర్లను కూడా తమకు ఇవ్వాలంటూ స్కూల్ యాజమాన్యాలపై అధికారులు ఒత్తిడి తెచ్చారు. 18వ తేదీ సిద్ధం సభ ఉండగా 17వ తేదీ సాయంత్రం 5గంటలకే బస్సులను తమకు అప్పగించాలని సూచించినట్లు తెలిసింది. ఈవిధంగా సమకూరిన బస్సులను అధికార పార్టీ నాయకుల సూచన మేరకు ఆయా గ్రామాలకు పంపించేందుకు రవాణాశాఖ అధికారులు సిద్ధం కావడం విమర్శలకు తావిస్తోంది. అంతేకాదు.. స్కూల్ బస్సులకు డీజల్, డ్రైవర్లకు రోజువారి బత్తా కూడా తామే చెల్లిస్తామని రవాణా శాఖ అధికారులు వాట్సాప్ మేసేజ్‌లు చేయడం ఆత్మకూరు ప్రాంతంలో చర్చనీయాంశమైంది. వాస్తవానికి ఎక్కడైనా స్కూల్ బస్సులను ఇతర అవసరాలకు వినియోగిస్తే రవాణా శాఖ అధికారులకు బస్సులను సీజ్ చేసిన సంఘటనలు ఉన్నాయి. అయితే రవాణా శాఖ స్వయంగా నిబంధనలను తుంగలోకి తొక్కి రాజకీయ పార్టీల సమావేశాలకు స్కూల్ బస్సులను సిద్ధం చేశారు.



ప్రైవేట్ స్కూల్ యాజమాన్యాల ఆవేదన

అధికార వైసీపీ తమ పార్టీ ప్రచార కార్యక్రమాలకు స్కూల్ బస్సులను వాడుకోవడంపై ఆయా ప్రైవేట్ స్కూల్స్ యాజమాన్యాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్వయంగా రవాణా శాఖ అధికారులే రంగంలోకి బస్సులను ఇవ్వాల్సిందేనని హుకుం జారీ చేస్తే తాము ఎవరికి చెప్పుకోవాలని మదనపడుతున్నారు. గతంలో కూడా ఆత్మకూరులో జరిగిన వైసీపీ సాధికార బస్సు యాత్ర కార్యక్రమానికి జనాన్ని తరలించేందుకు పాఠశాలలకు సెలవు ఇప్పించి మరీ బస్సులను ఉపయోగించుకున్నట్లు తెలిసింది. ఆ సమయంలో కొందరు బస్సుల్లోనే మద్యం సేవించి, ఆతర్వాత వాంతులు చేసుకుని, ఆహారాన్ని చిందరవందరగా పడేసి బస్సులను అపరిశుభ్రంగా మార్చేసిన సంఘటనలు ఉన్నాయని చెబుతున్నారు. దీంతో చేసేది ఏమీ లేక తమ పాఠశాల విద్యార్థుల కోసం స్కూల్ బస్సులను వాటర్ సర్వీసు చేయించుకున్నామని ఓ పాఠశాల కరస్పాండెంట్ ఆవేదన వెలిబుచ్చారు. అంతేకాదు.. ప్రైవేట్ స్కూల్ బస్సులకు స్పీడ్ మీటర్‌లో 60కిమీలకు పరిమితం ఉంటుంది. సుదూరప్రాంతమైన అనంతపురానికి వెళ్లే బస్సులు హైవేలో ఆ స్పీడ్‌కంటే ఎక్కువగా వెళ్లేందుకు ఆస్కారం వుంటుంది. అయితే హైవేలపై బస్సుల స్పీడ్ పెంచే ప్రయత్నం జరిగితే ఇంజన్ దెబ్బతినే ప్రమాదం ఉంటుందని, ఆవిధంగా బస్సులు ఏదైనా మరమ్మత్తులకు గురైతే ఎవరు బాధ్యత వహిస్తారు.

ఆర్టీసీ బస్సులు సైతం...



ఆత్మకూరు ఆర్టీసీ డిపో నుంచి సుమారు 40కిపైగా బస్సులను జగన్ సభకు తీసుకెళ్లేందుకు సిద్ధమయ్యాయి. ఈ లెక్కన కర్నూలుకు 25 బస్సులు, నంద్యాలకు 23 బస్సుల చొప్పున ప్రతిరోజులు రాకపోకలు సాగిస్తుండగా 18వ తేదీన నాలుగైదు సర్వీసులు మాత్రమే నడపాలని నిర్ణయించారు. దీంతో ఆయా ప్రాంతాలకు రాకపోకలు జరిపే ప్రజలకు ఇక్కట్లు తప్పేలా కనిపించడం లేదు. ఇప్పటికే ఆర్టీసీ బస్సు సర్వీసులు తక్కువై ప్రయాణికులు అవస్థలు పడుతుండగా, వైసీపీ సభల పేరిట ఉన్న బస్సుల సర్వీసులను రద్దు చేస్తే మరింత ఇబ్బందులకు గురికావాల్సి ఉంటుంది.

ఉన్నతాధికారుల నిర్ణయం మేరకే

ఉన్నతాధికారుల నిర్ణయం మేరకే స్కూల్ బస్సులను ఇవ్వాలని ప్రైవేట్ స్కూల్స్ యాజమాన్యాలను కోరాం. గతంలో కూడా పలు ప్రభుత్వ కార్యక్రమాలకు స్కూల్ బస్సులను ఉపయోగించారు. ఇందులో మా వ్యక్తిగత ఉత్సాహమేమి లేదు. అన్నిచోట్ల ఇలాగే స్కూల్ బస్సులను వాడుకుంటున్నారు. అనంతపురం జిల్లాలో జరిగే సిద్ధం సభలకు జనాన్ని తీసేందుకు బస్సులను తీసుకున్నాం.

- ఏఎస్ఎన్ రెడ్డి, మోటారు వెహికల్ ఇన్స్‌పెక్టర్, ఆత్మకూరు

యువతరం రాజకీయాల్లోకి రావాలి

జైభారత్ నేషనల్ పార్టీ అధ్యక్షుడు వీవీ లక్ష్మీనారాయణ



ఆత్మకూరులో మాట్లాడుతున్న వీవీ లక్ష్మీనారాయణ

ఆత్మకూరు/శ్రీశైలం, ఫిబ్రవరి 17: రాజకీయాల్లోకి యువత రావాలని జైభారత్ నేషనల్ పార్టీ అధ్యక్షుడు, సీబీఐ మాజీ జేడీ వీవీ లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. నేటి యువత కోసమే తమ పార్టీ ఆవిర్భవించిందని ఆయన పేర్కొన్నారు. శనివారం ఆయన శ్రీశైలం పరిధిలోని సున్నిపెంట, ఆత్మకూరులో పర్యటించారు. ఆత్మకూరు పట్టణంలోని శ్రీవెంకటేశ్వర డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ గోపిశెట్టి వెంకటేశ్వరరావు ఇటీవల అకాల మరణం పొందారు. ఆయన కుటుంబాన్ని లక్ష్మీనారాయణ పరామర్శించారు. అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో మార్పు రావాలంటే ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. దేశంలో 60శాతం కూడా ఓటింగ్ నమోదు కావడం లేదని తెలిపారు. కులం, మతం, ధనాన్ని ఎరచూపి రాజకీయ పక్షాలు ఓటర్లను ఆకర్షించే ప్రయత్నాలు చేస్తున్నాయని ఆరోపించారు. పోలింగ్ రోజు వస్తే జనం సెలవు దినంగా భావించకుండా బాధ్యతగా ఓటు హక్కును వినియోగించుకోవాని కోరారు. అవినీతి, అప్పులు, డ్రగ్స్, రౌడీయిజం లేని ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దడమే తమ పార్టీ ఉద్దేశమన్నారు. ప్రత్యేక హోదా ముగిసిన అధ్యాయం కాదని, రాష్ట్ర విభజన హామీలు, ప్రత్యేక హోదా కోసం తమ పార్టీ పోరాటం చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రైవేట్ కళాశాలల యాజమాన్యం గోపిశెట్టి వసుంధర, సాయిప్రణీత్, గంజి మోహన్‌కుమార్, క్రీస్తుదాసు, సత్యనారాయణ, వాసుదేవరెడ్డి, భానుమూర్తి, తిరుపయ్య, శ్రీధర్‌గుప్తా, ఆవులరెడ్డి, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల సన్నద్ధత ప్రణాళిక సిద్ధం చేయండి

కలెక్టర్ డాక్టర్ కె.శ్రీనివాసులు



మాట్లాడుతున్న కలెక్టర్ డా.కె.శ్రీనివాసులు

నంద్యాల (కల్చరల్), ఫిబ్రవరి 17: సార్వత్రిక ఎన్నికల సన్నద్ధత ప్రణాళికను సిద్ధం చేయాలని కలెక్టర్ డాక్టర్ కె.శ్రీనివాసులు 16 కమిటీల నోడల్ అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన చాంబర్‌లో జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డితో కలిసి నోడల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం సూచించిన అన్ని అంశాలపై అప్రమత్తంగా ఉండి విధులను నిర్వహించాలని అన్నారు. పోలింగ్ విధుల నిర్వహణకు అన్ని శాఖల సిబ్బంది వివరాలు తెప్పించుకొని రాండమైజేషన్ పద్ధతిలో విధుల కేటాయింపునకు సిద్ధంగా ఉండాలని సూచించారు. అన్ని విద్యా సంస్థల్లో ఓటు హక్కు నమోదు చేసుకోని విద్యార్థులను గుర్తించి ఫారం-6 ద్వారా వివరాలు సేకరించి నమోదు చేసే ప్రక్రియపై దృష్టి సారించాలని ఆదేశించారు. పోలింగ్ నిర్వహించే సిబ్బందికి శిక్షణ కార్యక్రమాలు ఇవ్వాలని, పోలింగ్ మెటీరియల్ సరఫరాలో లోటు పాట్లు లేకుండా నివేదికలు తయారు చేయాలని అన్నారు. ఎన్నికల విధుల్లో ప్రతి ఉద్యోగికి పోస్టల్ బ్యాలెట్ అవకాశం కల్పించేందుకు ఏర్పాట్లు చేసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల పరిశీలన, భద్రత, ట్రాన్స్‌పోర్టు, తదితర అంశాలపై జాగ్రత్తలు తీసుకోవాలని, ఈవీఎం మేనేజ్‌మెంట్ నోడల్ అధికారికి సూచించారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి, ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల ఖర్చు వివరాలను పర్యవేక్షించేందుకు ఎంసీసీ బృందాలను ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. కమ్యూనికేషన్ ప్లాన్, ఎలక్టోరల్ రోల్‌పై ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని సంబంధిత కమిటీ నోడల్ అధికారులకు సూచించారు.

పెండింగ్ బకాయిలు చెల్లించాలి

జేఏసీ చైర్మన్ టి.మణిశేఖర్ రెడ్డి



ర్యాలీ చేస్తున్న జేఏసీ నాయకులు

నంద్యాల రూరల్, ఫిబ్రవరి 17: ఉద్యోగుల పెండింగ్ బకాయిలను తక్షణమే చెల్లించాలని నంద్యాల జేఏసీ చైర్మన్ టి. మణిశేఖర్ రెడ్డి డిమాండ్ చేశారు. రాష్ట్ర ఐక్య కార్యాచరణ సమితి పిలుపు మేరకు నంద్యాల జేఏసీ శనివారం జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహించింది. ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ మాట్లాడుతూ ఉద్యోగుల పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించడంతోపాటు ప్రస్తుతం ధరలకు అనుగుణంగా 30 శాతం మధ్యంతర భృతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రధాన కార్యదర్శి బి. హుసేన్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి తన పాదయాత్రలో ఇచ్చిన హామీలో భాగంగా తక్షణమే సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ఏపీటీఎఫ్ 1938 రాష్ట్ర కార్యదర్శి నగర్ శ్రీనివాసులు మాట్లాడుతూ జీపీఎఫ్, ఏపీజీఎల్ఐ, ఎస్ఈఎల్ బకాయిలు తక్షణమే చెల్లించాలన్నారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పీవీ ప్రసాద్ మాట్లాడుతూ ఉద్యోగులపై భౌతిక దాడులు ఆపాలని డీఏ అరియర్స్ 11వ పీఆర్సీకి సంబంధించిన అరియర్స్ తక్షణమే చెల్లించాలని, లేని పక్షంలో ప్రభుత్వంపై పోరాటానికి సిద్ధమని హెచ్చరించారు. ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి మాట్లాడుతూ పీఆర్సీ కమిషన్ వేసి 30 శాతం ఐఆర్ తక్షణమే చెల్లించాలని అన్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు మౌళాలి, పెన్షన్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ప్రసాద రెడ్డి, ఎన్జీఓ అసోసియేషన్ సభ్యులు నరసారెడ్డి, నారాయణ రెడ్డి, రాముడు, నాలుగో తరగతి ఉద్యోగుల జిల్లా అధ్యక్షులు గోవిందు, నారాయణ, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.


శ్రీశైలంలో కొనసాగుతున్న మహా కుంభాభిషేక వేడుకలు



హోమం నిర్వహిస్తున్న శ్రీశైలం జగద్గురు పీఠాధిపతి

శ్రీశైలం, ఫిబ్రవరి 17: శ్రీశైలం మహా క్షేత్రంలో లోక కల్యాణార్థం, ప్రజా సంక్షేమం కోసం చేపట్టిన మహాకుంభాభిషేకం మహోత్సవ క్రతువులు రెండో రోజు శనివారం వైభవంగా కొనసాగాయి. వేడుకల్లో భాగంగా ఉదయం సకల దోషాలను హరింపజేసే గోపూజ, మండప పూజలు, జపాలు, వేదపారాయణలు, గణపతి, రుద్ర, చండీ పారాయణలు తదితర క్రతువులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాయంత్రం క్షరాధివాసం, దేవతాహవనములు, వేదహవనములు, వేదస్వస్తి, నీరాజనంచ మంత్రపుష్పం తదితర ప్రత్యేక పూజలను నిర్వహించారు. కుంబాభిషేకం వేడుకలను తిలకించేందుకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. మహా కుంభాభిషేకం పూజా కార్యక్రమంలో శ్రీశైలం జగద్గురు పీఠాధిపతి శ్రీశైల జగద్గురు పీఠాధిపతి శ్రీ చెన్నసిద్ధరామ పండితారాధ్య శివాచార్య మహాస్వామి పాల్గొన్నారు.





వేడుకలో పీఠాధిపతి చెన్నసిద్ధరామ పండితారాధ్య శివాచార్య మహాస్వామి ...

పథకాల పేర్లు మార్చి ప్రచారం

ఏపీసీసీ మీడియా చైర్మన్ డాక్టర్ ఎన్.తులసిరెడ్డి



మాట్లాడుతున్న తులసిరెడ్డి

నంద్యాల టౌన్, ఫిబ్రవరి 17: పథకాల పేర్లు మార్చి జగన్ ప్రచారం చేసుకుంటున్నారని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ ఎన్.తులసిరెడ్డి అన్నారు. శనివారం నంద్యాల డీసీసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జగన్ పాలనలో రాష్ట్రంలో సంక్షేమం మేడి పండు చందంగా తయారైందని విమర్శించారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం సమర్థవంతంగా అమలు చేసిన పథకాల పేర్లు మార్చి జగన్ ప్రచారం చేసుకుంటున్నారని ఎద్దేవా చేశారు. పని కంటే ప్రచార ఖర్చు ఎక్కువైందని అన్నారు. జగన్ ప్రభుత్వం సంక్షేమ పథకాల పేరుతో ప్రజలకు ఇచ్చింది గోరంత కాగా ధరలు పెంచి ప్రజల నుంచి లాక్కున్నది కొండంత అని ఆరోపించారు. ఎనిమిది సార్లు కరెంటు చార్జీలు, మూడు సార్లు ఆర్టీసీ చార్జీలు పెంచిందని, మద్యం, ఇసుక, సిమెంట్, పెట్రోల్, డీజిల్, నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెరిగాయని అన్నారు. పొరుగు రాష్ట్రాల కంటే ఆంధ్రప్రదేశ్‌లో పెట్రోల్, డీజిల్ ధరలు లీటర్‌కు ఆరు, ఏడు రూపాయలు ఎక్కువగా ఉన్నాయని తెలిపారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే పెట్రోల్ ధరలు తగ్గిస్తానని ప్రతిపక్ష నాయకుడిగా ఉన్నప్పుడు జగన్ చెప్పారని గుర్తు చేశారు. ప్రస్తుతం పెట్రోల్ ధరలు లీటర్‌కు ఆంధ్రప్రదేశ్ కర్ణాటక కంటే 10.42 రూపాయలు, తమిళనాడు కంటే 9.52 రూపాయలు ఎక్కువ అని తెలిపారు. లీటర్ డీజిల్ ధర ఆంధ్రప్రదేశ్‌లో కర్ణాటక కంటే 12 రూపాయలు, తమిళనాడు కంటే 6 రూపాయలు, ఒడిస్సా కంటే 5.39 రూపాయలు ఇలా పలు ఇతర రాష్ట్రాల కంటే డీజిల్ ధరలు ఏపీలోనే ఎక్కువ అని ఇతర రాష్ట్రాలతో పోల్చి చెప్పారు. జగన్ ముఖ్యమంత్రి అయ్యాక 56 నెలల కాలంలో లక్షా నలభై కోట్ల రూపాయల అదనపు భారం ప్రజలపై పడిందని విమర్శించారు. ఇందులో మద్యం ద్వారా పదహారు వేల కోట్లు, ఇసుక ద్వారా పది వేల కోట్లు, ఆస్తి పన్ను పెంపు ద్వారా 7 వేల కోట్లు, డ్రైనేజీ, నీటి పన్ను ద్వారా నాలుగు వేల కోట్లు, విద్యుత్ చార్జీల పెంపు ద్వారా 30 వేల కోట్లు, పెట్రోల్, డీజిల్ ధరలు పెంపు ద్వారా 50 వేల కోట్లు, ఆర్టీసీ చార్జీల ద్వారా 15 వేల కోట్లు అదనపు భారం ప్రజలపై పడిందని తెలిపారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు దాసరి చింతలయ్య, రాష్ట్ర అధికార ప్రతినిధి ఉకొట్టు వాసు, తదితరులు పాల్గొన్నారు.

రెండో స్వాతంత్ర్య సంగ్రామానికి సిద్ధం కావాలి

- సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ గోపాల గౌడ
- కర్నూలులో రాజ్యాంగ పరిరక్షణ సదస్సు



కర్నూలు (కల్చరల్), ఫిబ్రవరి 17: రెండో స్వాతంత్ర పోరాటానికి ప్రజలు సిద్ధం కావాలని, బీజేపీ దానికి మద్దతునిచ్చే పార్టీలను సాగనంపేందుకు ప్రజలు సిద్ధంగా ఉండాలని సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ గోపాల గౌడ పిలుపునిచ్చారు. శనివారం రాత్రి నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో భారత రాజ్యాంగ హక్కుల పరిరణ వేదిక ఆధ్వర్యంలో 'రాజ్యాంగాన్ని రక్షించుకుందాం-ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుందాం' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సదస్సునకు ముఖ్య అతిథులుగా జస్టిస్ గోపాల గౌడ, సుప్రీంకోర్టు ప్రముఖ న్యాయవాది ప్రశాంత్ భూషణ్, ప్రముఖ రాజ్యాంగ విశ్లేషకులు ఫైసల్ ఖాన్ హాజరయ్యారు. వీరితో పాటు రాజ్యాంగ హక్కుల పరిరక్షణ వేదిక రాష్ట్ర కన్వీనర్ వడ్డే శోభనాధీశ్వరరావు, వేదిక కో కన్వీనర్ విజయరావు, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, జై భారత్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జేడీ లక్ష్మీనారాయణ, ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి కన్వీనర్ చలసాని శ్రీనివాసరావు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు కె.తులసిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఎంఏ గఫూర్, ఏపీ ఎస్సీ, ఎస్టీ లాయర్ల ఫోరం ఫర్ సోషల్ జస్టిస్ అధ్యక్షుడు వై.జయరాజు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జస్టిస్ గోపాల్ గౌడ మాట్లాడుతూ దేశంలో ప్రస్తుతం ప్రమాదకరమైన పరిస్థితి నెలకొందన్నారు. కౌరవుల్లాంటి బీజేపీ పాలనను సాగనంపేందుకు పాండవుల్లాంటి పార్టీలకు ప్రజలే శ్రీకృష్ణులై సహకరించి, పజాస్వామ్యవాదులకు అండగా నిలవాలని కోరారు. 77 ఏళ్ల స్వాతంత్ర దేశంలో పేదలు పేదలుగానే ఉన్నారని, కార్మికులకు సరైన వేతనాలు దక్కడం లేదన్నారు. యువతకు ఉద్యోగాలులేవని పదేళ్లుగా బీజేపీ సర్కారు ప్రజలతో ఆడుకుంటోందని అన్నారు. స్వామినాథన్ దేశమంతా తిరిగి అనేక సిఫార్సులు చేయడమే కాక, రైతులకు కనీస మద్దతు ధర ఇవ్వాలని చెప్పారని గుర్తు చేశారు. కానీ నేటికీ దాన్ని ఈ ప్రభుత్వాలు అమలు చేయకుండా స్వామినాథన్‌కు భారతరత్న ఇచ్చి గొప్పలు చెప్పుకుంటోందని అన్నారు. డిల్లీ సరిహద్దులో ఏడాది పాటు రైతులు ఆందోళన చేయగా మద్దతు ధర ఇస్తామని హామీలు ఇచ్చి నేటికీ అమలు చేయడం లేదని విమర్శించారు. కార్పొరేట్లకు ఉపశమన చర్యలు చేస్తున్న మోదీ సర్కారు రైతుల సమస్యలు ఎందుకు పట్టించుకోవడం లేదని ఆయన ప్రశ్నించారు. జీఎస్టీ వసూలుకు చర్యలు తీసుకున్నప్పుడు రైతులకు కనీస మద్దతు ధర ఎందుకు ఇవ్వరని అన్నారు.

- సుప్రీంకోర్టు న్యాయవాది ప్రశాంత్ భూషణ్ మాట్లాడుతూ దేశంలో రైతులు, కార్మికులు, మైనార్టీలు మోదీ పాలనలో ఆందోళన చెందుతున్నారని అన్నారు. వ్యవసాయాన్ని అదానీ, అంబానీలకు కట్టిబెట్టేందుకు మూడు నల్ల చట్టాలు తెచ్చి రైతులను తీవ్ర ఇబ్బంది పెట్టారన్నారు.
- రాజ్యాంగ విశ్లేషకులు ఫైజల్ ఖాన్ మాట్లాడుతూ మోదీ అందరినీ విడదీసి, బ్రిటీషువారిలా విభజించి పాలిస్తున్నారని చెప్పారు. ఓటు ద్వారా బీజేపీకి బుద్ధిచెప్పాలని పిలుపునిచ్చారు.
- చలసాని శ్రీనివాస్, జేడీ లక్ష్మీనారాయణ, తులసిరెడ్డిలు మాట్లాడుతూ రాష్ట్రాన్ని రెండుగా చీల్చి విభజన హామీలను తుంగలో తొక్కింది బీజేపీ ప్రభుత్వమేనని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా అంశంలో మాటమార్చి రాష్ట్రాన్ని ఆర్థికపరంగా పదేళ్ల వెనక్కు నెట్టేసిందన్నారు. రాబోయే ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ విజ్ఞతతో ఆలోచించి ఓటు వేయాలని, కేంద్రంలో బీజేపీని సాగనంపేదిశగా ఓట్లు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర నాయకుడు ప్రభాకర్‌రెడ్డి, గౌరవాధ్యక్షుడు రామచంద్రయ్య, సీపీఎం నాయకులు గౌస్ దేశాయ్, గిడ్డయ్య తదితరులు పాల్గొన్నారు.



జస్టిస్ గోపాల గౌడ ప్రసంగిస్తుండగా వేదికపై ఆసీనులైన ప్రశాంత్ భూషణ్, వడ్డే శోభనాదీశ్వరరావు, చలసాని శ్రీనివాసరావు తదితరులు

దగా డీఎస్సీ మాకొద్దు : ఎన్ఎస్‌యూఐ



మంత్రి బుగ్గన ఇంటి ముట్టడికి ర్యాలీగా వెళ్తున్న ఎన్ఎస్‌యుఐ నాయకులు

డోన్(రూరల్), ఫిబ్రవరి 17: రాష్ట్ర ప్రభుత్వం ఆరు వేల పోస్టుల భర్తీతో విడుదల చేసిన దగా డీఎస్సీ తమకొద్దని ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర అధ్యక్షుడు నాగ మధు యాదవ్ అన్నారు. శనివారం ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో కార్యకర్తలు డోన్‌లో ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ఇంటి ముట్టడికి యత్నించారు. పట్టణంలోని ప్రధాన రోడ్డు నుంచి మంత్రి ఇంటి ముట్టడికి ర్యాలీగా వెళ్తుండగా పట్టణ సీఐ ప్రవీణ్ కుమార్, తన పోలీసు సిబ్బందితో వారిని అడ్డగించి పోలీసు జీపులో పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా నాగమధు యాదవ్ మాట్లాడుతూ ఎన్నికల ముందు సీఎం జగన్ నిరుద్యోగుల కోసం జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని చెప్పారని అన్నారు. నాలుగున్నరేళ్ల తరువాత ఆరు వేల పోస్టులతో డీఎస్సీ విడుదల చేసిందని తెలిపారు. ఎన్నికల వేళ డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసి, మెగా డీఎస్సీ అని ప్రకటించుకోవడం సిగ్గుచేటన్నారు. రాబోయే ఎన్నికల్లో నిరుద్యోగులు వైసీపీ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతారన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ జిల్లా, రాష్ట్ర నాయకులు తెలుగు విజయకుమార్, సాయి కుమార్, శ్రీను, జనార్దన్, బండారు శివ, మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

టీజీ వెంకటేష్‌కు ప్రతిష్టాత్మక అవార్డు



తెలంగాణ గవర్నర్ నుంచి అవార్డు అందుకున్న టీజీ వెంకటేష్

కర్నూలు(అర్బన్), ఫిబ్రవరి 17: మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్‌కు ప్రతిష్టాత్మక సంసద్ మహారత్న అవార్డు దక్కింది. పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ చైర్మన్‌గా ఆయన పనితీరును గుర్తిస్తూ 14వ సంసద్ మహా రత్న అవార్డుకు ఎంపికయ్యారు. శనివారం న్యూఢిల్లీలోని మహారాష్ట్ర సదన్‌లో జరిగిన కార్యక్రమంలో తెలంగాణ గవర్నర్ తమిళిసై సౌందర్య రాజన్ చేతుల మీదుగా టీజీ వెంకటేశ్ అవార్డును అందుకున్నారు. రాజ్యసభ సభ్యుడిగా ఉన్న సమయంలో రవాణా, పర్యాటకం, జాతీయ రహదారులు, పౌర విమానయానం, రైల్వే భద్రత, సాంస్కృతిక శాఖలకు సంబంధించి పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ చైర్మన్‌గా టీజీ వ్యవహరించారు. ఆయన సేవలను గుర్తించిన ప్రేమ్ పాయింట్ ఫౌండేషన్ అనే సంస్థ 2022-23 సంవత్సరానికి సంసద్ మహారత్న అవార్డుకు టీజీ వెంకటేశ్‌ను ఎంపిక చేసింది. అవార్డు అందుకున్న ఆయన్ను పలువురు అభినందించారు.

బీజేపీ దేశానికి శని గ్రహం

- పదేళ్లలో రూ.115 కోట్ల అప్పులు
- రాష్ట్రంలో బీజేపీ పాలన
- మీడియా చైర్మెన్ ఎన్. తులసిరెడ్డి



మాట్లాడుతున్న ఎన్.తులసి రెడ్డి

కర్నూలు(అర్బన్), ఫిబ్రవరి 17: దేశానికి బీజేపీ శనిగ్రహం లాంటిందని, టీడీపీ, వైసీపీలు రాహు, కేతువులని కాంగ్రెస్ పార్టీ మీడియా చైర్మన్, మాజీ రాజ్యసభ సభ్యుడు డాక్టర్ ఎన్.తులసి రెడ్డి అన్నారు. శనివారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో డీసీసీ అధ్యక్షుడు కే బాబురావుతో కలిసి మాట్లాడారు. రాష్ట్రంలో బీజేపీ పాలన సాగిస్తోందని విమర్శించారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయపోతే రాష్ట్రం మరింత అధ్వాన్న పరిస్థితికి దిగజారుతుందన్నారు. రాష్ట్రానికి జీవనాడిగా భావిస్తున్న పోలవరానికి పంగనామాలు పెట్టారని, ప్రత్యేక హోదాను అటకెక్కించారని అన్నారు. కడప స్టీల్ ప్లాంట్‌కు స్వస్తి పలికారని, ఆంధ్రుల హక్కు విశాఖ ఉక్కును అమ్మకానికి పెట్టారని విమర్శించారు. ఇలా రాష్ట్రానికి తీరని ద్రోహం చేసిన బీజేపీతో జతకట్టే దుష్టచతుష్టం పార్టీలైన వైఎస్సార్‌సీపీ, టీడీపీ, జనసేనలకు ఓట్లు వేస్తే రాష్ట్రానికి తీరని ద్రోహం చేసిన వారమవుతామని హెచ్చరించారు. 1947 నుంచి 2014 వరకు 67 సంవత్సరాల కాంగ్రెస్ పాలనలో పండిట్ నెహ్రూ నుంచి మన్మోహన్ సింగ్ వరకు ప్రధానులుగా రూ.46 లక్షల అప్పులు చేస్తే పదేళ్లలో మోదీ రూ. 115 కోట్ల అప్పులు చేసి దేశాన్ని అమ్మకానికి పెట్టారని మండిపడ్డారు. విమానాశ్రయాలు, ఓడరేవులు, రైల్వే, ఎల్ఐసీ సంస్థలను మోదీ, అమిత్ షాలు అమ్మకానికి పెడితే అంబానీ, ఆదానీలు కొనడానికి తెగబడ్డారని ధ్వజమెత్తారు. ఇలాంటి బీజేపీతో జట్టు కట్టడానికి ఆ మూడు పార్టీలు పాకులాడుతున్నాయని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేయడమంటే మన కంటితో మన కన్ను పొడుచుకున్నట్లేనని ధ్వజమెత్తారు.

ఎన్నికల నిర్వహణ టీమ్‌లను ఏర్పాటు చేయండి

- జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వండి
- పెండింగ్‌లో ఉన్న ఓటరు దరఖాస్తులను పరిష్కరించండి
- అధికారులను ఆదేశించిన కలెక్టర్ డాక్టర్ జి.సృజన



కర్నూలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 17: పెండింగ్‌లో ఉన్న ఓటరు దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని, ఎన్నికల నిర్వహణకు సంబంధించిన టీములను సోమవారంలోపు ఏర్పాటు చేయాలని కలెక్టర్ డా.జి.సృజన అధికారులను ఆదేశించారు. శనివారం రిటర్నింగ్ అధికారులు, తహసీల్దార్లు, సంబంధిత జిల్లా అధికారులతో పెండింగ్ దరఖాస్తులు, జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల మంజూరు, పోలింగ్ స్టేషన్‌లలో మౌలిక సదుపాయాలు తదితర అంశాలపై టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న 6, 8 ఓటరు దరఖాస్తులను మూడు రోజుల్లోపు పూర్తి చేయాలన్నారు. పోలింగ్ స్టేషన్‌లలో మౌలిక సదుపాయాలు ఉన్నాయా లేదా అని కచ్చితంగా తెలుసుకోవాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. ఏ పోలింగ్ స్టేషన్‌లో కూడా టాయిలెట్, ర్యాంపు, విద్యుత్ సౌకర్యం, నీరు లేకుండా ఉండకూడదని కలెక్టర్ స్పష్టం చేశారు. పోలింగ్ విధులు నిర్వహించే సిబ్బంది ఒక రోజు ముందుగానే వారికి కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు వెళ్తారని తెలిపారు. ఎంసీసీ, ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ, ఈఈఎం, వీఎస్‌టీ, వీవీటీ టీములను సోమవారం నాటికి ఏర్పాటు చేయాలని ఆర్వోలను ఆదేశించారు. వీరికి శిక్షణ కూడా ఈ నెల 29 నాటికి పూర్తి చేయాలన్నారు. సెక్టార్ ఆఫీసర్లు, సెక్టార్ పోలీస్ ఆఫీసర్లు పోలింగ్ స్టేషన్లకు సంబంధించి మ్యాపింగ్ 2, 3 నివేదికలను ఈ నెల 29లోపు సిద్ధం చేయాలని సూచించారు. 1500 మంది కంటే ఎక్కువ ఓటర్లు ఉంటే యాక్సిలరీ పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాలని కోరారు. 200 మీటర్ల పరిధిలో పొలిటికల్ పార్టీ కార్యాలయాలు ఉండకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. పోలింగ్ స్టేషన్‌లు కచ్చితంగా గ్రౌండ్‌ఫ్లోర్‌లోనే ఉండాలని స్పష్టం చేశారు. జర్నలిస్టు హౌసింగ్ స్కీం కింద జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు వెరిఫికేషన్ 6 స్టెప్ వ్యాలిడేషన్ ఆధారంగా ఉండకూడదని ఆర్డీవోలు, తహసీల్దార్లను ఆదేశించారు. ఐదు ఎకరాల పొలం, కారు ఉందా లాంటి అంశాలు వెరిఫికేషన్ చేయాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. గతంలో ఇళ్ల స్థలాలు ఇచ్చారా అనే విషయంపై మాత్రం వెరిఫై చేయాలని సూచించారు. వెరిఫికేషన్ నివేదిక వచ్చిన తర్వాత కమిటీ సభ్యుల ద్వారా అనర్హులుగా ఉన్న వారిని సోమవారం పిలిపించి వారి అభ్యంతరాలు ఉన్నట్లయితే తెలుసుకోవాలని జాయింట్ కలెక్టర్‌కు ఆమె సూచించారు. అలాగే ఇళ్ల స్థలాలకు కావాల్సిన భూమిపై కూడా స్పష్టత ఇవ్వాలని ఆదేశించారు. టెలి కాన్ఫరెన్స్‌లో జేసీ నారపురెడ్డి మౌర్య, మున్సిపల్ కమిషనర్ భార్గవ్‌తేజ, ఆదోని సబ్ కలెక్టర్ శివనారాయణశర్మ పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య

కర్నూలు, ఫిబ్రవరి 17: తాలుకా పోలీస్‌స్టేషన్ పరిధిలోని తాండ్రపాడులో ఉన్న ఎస్ఆర్ కళాశాలలో ఇర్ఫాన్ (16) అనే విద్యార్థి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఉయ్యాలవాడ గ్రామానికి చెందిన ఇర్ఫాన్ ఎస్ఆర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం (ఎంపీసీ) చదువతున్నాడు. కొద్ది కాలంగా ఒంటరిగా ఉండేవాడు. శనివారం కాలేజీకి వెళ్లకుండా హాస్టల్‌లో ఉన్నాడు. ఇర్ఫాన్ తోటి మిత్రులందరూ కళాశాలకు వెళ్లి తిరిగి సాయంత్రం హాస్టల్ గదికి చేరుకున్నారు. తలుపు గది లోపలి నుంచి గడియ పెట్టి ఉండటంతో విద్యార్థులు పాఠశాల యాజమాన్యానికి సమాచారం ఇచ్చారు. కళాశాల యాజమాన్యం అక్కడికి చేరుకుని తలుపులు గది పగులకొట్టి చూస్తే ఇర్ఫాన్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుని కనిపించాడు. ఇర్ఫాన్‌ను కిందకు దించి ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారించారు. ఇర్ఫాన్ తండ్రి షఫీవుల్లా రైతు పని చేస్తుంటాడు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ శ్రీధర్ తెలిపారు.

అటవీ శాఖ అధికారులపై సస్పెన్షన్ వేటు

వెలుగోడు, ఫిబ్రవరి 17 : వెలుగోడు అటవీ శాఖలో విధులు నిర్వహిస్తున్న ఇద్దరిని సస్పెండ్ చేసినట్లు అటవీశాఖ అధికారి ఖాన్ తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నల్లమల అటవీ ప్రాంతంలో చట్ట విరుద్ధంగా వ్యవహరించి, అసాంఘిక కార్యకలాపాలకు సహకరించిన సెక్షన్ ఆఫీసర్ జయరాజ్, బీట్ ఆఫీసర్ ఈదన్నలను ఆత్మకూరు అటవీశాఖ డిప్యూటీ డైరెక్టర్ అలాన్ చొంగ్ టేరాన్ విచారణ చేసి సస్పెన్షన్ చేసినట్లు తెలిపారు.

శ్రీశైలంలో జంట ఆత్మహత్య

శ్రీశైలం, ఫిబ్రవరి 17: శ్రీశైలం దేవస్థానం వసతి గృహం గౌరీ సదన్ రూము 137లో ఓ జంట ఆత్మహత్య చేసుకుంది. తెలంగాణ రాష్ట్రం రంగారెడ్డి జిల్లా సరూర్‌నగర్‌కు చెందిన మల్లేష్(32), సరిత(28) ఈ నెల 13వ తేదీన ఉదయం శ్రీశైలం చేరుకుని గౌరీ సదన్ నందు 137 రూమును తీసుకున్నారు. నాలుగు రోజుల నుంచి రూమును రెన్యువల్ చేయలేదు. దుర్వాసన వస్తోందని పక్కగదిలో ఉన్న యాత్రికులు దేవస్థానం సిబ్బందికి తెలియజేశారు. అధికారులు పోలీసులకు సమాచారం తెలియజేశారు. శ్రీశైలం సీఐ ప్రసాదరావు ఘటనా స్థలానికి తలుపులు తెరిపించారు. గదిలో ఇద్దరు ఫ్యానుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్టు గుర్తించారు. కాగా సరూర్ నగర్‌కు చెందిన మల్లేష్, సరితలు ఇద్దరు వివాహితులు. వారు కొన్నేళ్లుగా వివాహేతర సంబంధం కొనసాగించేవారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

పదవి కోసం పాకులాట

- ప్రైవేట్ స్కూల్లో కుమారుడు
- స్కూల్ కమిటీ చైర్‌పర్సన్‌గా భార్య
- వైసీపీ నాయకుడి నిర్వాకం



ప్రభుత్వ పాఠశాల

ఆదోని రూరల్, ఫిబ్రవరి 17: పదవుల కోసం వైసీపీ నాయకులు అడ్డదారులు తొక్కుతున్నారు. హోదా చిన్నదా? పెద్దదా? అని తేడా లేదు... ప్రభుత్వం తమది, తాము అనుకుంటే పదవి వచ్చి తీరాల్సిందే అన్నట్లు వైసీపీ నాయకుల వ్యవహారం కొనసాగుతోంది. తాజాగా ఆదోని మండలంలోని నెట్టేకల్లు ప్రభుత్వ పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ హోదా కోసం వైసీపీ నాయకుడి నిర్వాకం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. నెట్టేకల్లు ఎంపీయూపీ ప్రభుత్వ పాఠశాలలో 1 నుండి 8వ తరగతి వరకు 221మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. ఏడుగురు ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తున్నారు. గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు మంజునాథ 2020 సెప్టెంబరు 28న తన కొడుకు రాకేష్‌ను ఒకటో తరగతిలో చేర్పించాడు. 2021 అక్టోబరులో పాఠశాల విద్యాకమిటీ ఎన్నికలు జరిగాయి. విద్యా కమిటీ ఎన్నికల్లో మంజునాథ తన అధికార బలంతో భార్య సులోచనను కమిటీ చైర్‌పర్సన్‌గా గెలిపించుకున్నాడు. నెల తిరిగేలోపు మంజునాథ తన కొడుకు రాకేష్‌ను ఆదోనిలోని మల్లికార్జున ప్రైవేట్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో చేర్పించాడు. విద్యార్థి రాకేష్ ప్రభుత్వ పాఠశాలలో అటెండెన్స్ లేకపోవడంతో గత ఏడాది అక్టోబరులో ప్రభుత్వమే రాకేష్ పేరును అటెండెన్స్ నుంచి తొలగించింది. అయినా రెండున్నర సంవత్సరాల వ్యవధిలో విద్యా కమిటీ చైర్‌పర్సన్‌గా ఎన్నికైన సులోచన, ఆమె భర్త పాఠశాలలో జరిగే ప్రతి కార్యక్రమాల్లో పాల్గొంటూ రాచమర్యాదలు పొందుతున్నారు. నాడు - నేడు పనులు కూడా తన కనుసన్నల్లోనే జరిగేలా చక్రం తిప్పాడు. ఇందుకు సదరు పాఠశాల సిబ్బంది ఒత్తాసు పలికారు. నిబంధనలకు విరుద్ధంగా పాఠశాలలో చదవని విద్యార్థి తల్లినే విద్యా కమిటీ చైర్‌పర్సన్‌గా కొనసాగిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదువు కొనసాగిస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులే పాఠశాల కమిటీ అధ్యక్షులుగా అయ్యేందుకు అర్హులు. కానీ సదరు వైసీపీ నాయకుడు మాత్రం అడ్డదారుల్లో అధికారులను మోసం చేసి భార్యకు విద్యా కమిటీ చైర్‌పర్సన్ పదవిని తెచ్చుకున్నాడు. ప్రభుత్వ పాఠశాలలో జరిగే గౌరవ మర్యాదలు పొందుతూ, గణతంత్ర, స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొంటున్నారు. సమావేశానికి దర్జాగా హాజరవుతూ రాచ మర్యాదలు పొందుతున్నారు. ఇదిలా ఉండగా ప్రైవేట్ పాఠశాల సైతం టీసీ లేకుండా విద్యార్థికి అడ్మిషన్ ఇచ్చినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.



ప్రభుత్వ కార్యక్రమంలో పాల్గొన్న విద్యా కమిటీ చైర్మన్, భర్త వృత్తంలో ఉన్న వారు (ఫైల్)

విద్యా కమిటీ చైర్మన్‌కు సమాచారం ఇచ్చాం

రాకేష్ పాఠశాలకు సరిగా రావడం లేదని విద్యా కమిటీ చైర్‌పర్సన్ సులోచనకు సమాచారం ఇచ్చాం. సదరు విద్యార్థి పాఠశాలకు గైర్హాజరు కావడంతో ప్రభుత్వమే ఆన్‌లైన్ అటెండెన్స్‌లో పేరును తొలగించింది.

- దిలీప్ కుమార్, ప్రధానోపాధ్యాయుడు, నెట్టేకల్లు

మా పాఠశాలలో చదువుతున్నాడు

నెట్టేకల్లుకు చెందిన విద్యార్థి రాకేష్ తమ పాఠశాలలో మూడో తరగతి చదువుతున్నాడు. కానీ అతని చదువుకు సంబంధించిన వివరాలు ఆన్‌లైన్‌లో పొంద పర్చలేదు. ట్యూషన్ పరంగా చేర్చుకున్నాం.

-నరసింహ రాజు, మల్లికార్జున ప్రైవేట్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ హెచ్‌ఎం, ఆదోని

విచారణ చేసి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం

నెట్టేకల్లు ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులే చైర్మన్‌గా కొనసాగాలి. ప్రైవేట్ పాఠశాలలో చదివే విద్యార్థుల తల్లిదండ్రులు చైర్మన్‌గా కొనసాగడం చట్టరీత్యా నేరం. ఈ విషయం నా దృష్టికి రాలేదు. నేడు విచారించి నివేదికను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా.

- శ్రీనివాసులు ఎంఈఓ-2, ఆదోని


అంగన్‌వాడీ పోస్టులకు ఇంటర్వ్యూలు

కర్నూలు(రూరల్)ఫిబ్రవరి17: కర్నూలు రెవెన్యూ డివిజనల్ పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకుల పోస్టులకు శనివారం అధికారులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ ఇంటర్వులకు 140మంది అభ్యర్థులు హాజరయ్యారు. అత్యధికంగా 33 హెల్పర్ పోస్టులకు 138 మంది దరఖాస్తులు చేసుకున్నట్లు కమిటీ సభ్యులు వివరించారు. ఉదయం 11 గంటలకు ప్రారంభమైన ఇంటర్వ్యూలు సాయంత్రం 6 వరకూ కొనసాగాయి. ఇంటర్వ్యూలను కర్నూలు ఆర్డీఓ శేషిరెడ్డి, డీఎంహెచ్‌వో రామగిడ్డయ్య, ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటలక్ష్మమ్మ నిర్వహించగా సీడీపీవోలు వరలక్ష్మీదేవమ్మ, అనురాధ, లూక్, ఆర్డీవో కార్యాలయ ఏఓ ఝాన్సీలక్ష్మీ పాల్గొన్నారు.

పరిష్కారం చూపని 'స్పందన'

● పని జరగకపోయినా రిపోర్టులు ● కార్యాలయాల చుట్టూ రైతుల ప్రదక్షిణలు

పాణ్యం, ఫిబ్రవరి 17: స్పందనలో పరిష్కారం దొరుకుతుందన్న ఆశతో ప్రతి సోమవారం బాధితులు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా పరిష్కారం దొరకకపోగా పరిష్కారమైనట్లు రికార్డుల్లో చూపుతున్నారు. దీంతో బాధితులు తమ సమస్యలను ఎవరికి విన్నవించుకోవాలో దిక్కుతెలియని పరిస్థితి నెలకొంది. పాణ్యం మండలంలో రెవెన్యూ శాఖకు ప్రతి సోమవారం దాదాపు పది సమస్యలు అధికారుల దృష్టికి రాగా వాటిలో పరిష్కారమయ్యేవి కొద్దిగా ఉండడంతో బాధితులు కార్యాలయాల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. సమస్యలను పరిష్కరించకపోయినా పరిష్కరించినట్లు రికార్డుల్లో చూపిస్తున్నారు. ఇదేమని ప్రశ్నిస్తే మళ్లీ స్పందనకు వెళ్లమంటూ ఉచిత సలహాలు ఇస్తూ కాలం గడుపుతున్నారు. ఎలాగూ ఎన్నికలు వస్తుండడంతో బాధితులకు ఎన్నికల బూచి చూపిస్తూ తప్పించుకుంటున్నట్లు బాధితులు ఆరోపిస్తున్నారు. భూముల సమస్యలను రీసర్వే పేరుతో పరిష్కరించడం లేదు. రికార్డులు పక్కాగా ఉన్న భూములను ఆన్‌లైన్‌లో చేర్చడానికి అవకాశమున్నా ఆన్‌లైన్ చేయడంలేదని రైతులు ఆరోపిస్తున్నారు. పాణ్యం గ్రామానికి చెందిన గంతి చంద్రశేఖర్ అనే రైతుకు చెందిన సర్వే నెంబరు 1411/2లో 2. 75 ఎకరాలు 1933 నుంచి ఆర్వోఆర్, ఆర్ఎస్ఆర్, అడంగళ్ తదితర రికార్డుల్లో ఉంది. 1998లో ఎస్సార్బీసీ కాల్వ నిర్మాణానికి 43 సెంట్లు భూసేకరణ శాఖ సేకరించింది. సేకరించిన భూమిని రెవెన్యూ శాఖ తమ రికార్డుల్లో నమోదు చేయలేదు. 1999 జూలై 14న చంద్రశేఖర్ భూమి భూసేకరణలో తొలగించలేదని పాణ్యం గ్రామానికి చెందిన కె.నాగమ్మ అనే మహిళా రైతు భూమి సేకరించినట్లు భూసేకరణ శాఖ అధికారులు వివరణ ఇచ్చుకున్నారు. అయినా నాగమ్మ భూమిని ఆన్‌లైన్‌లో తొలగించకపోగా అప్పటికే చంద్రశేఖర్‌కు చెందిన 1. 60 ఎకరాలు తొలగించినట్లు రైతు వాపోయాడు. దీంతో రైతు నాలుగు సార్లు చలానాలు కట్టి సర్వే చేయించి రిపోర్టును సమర్పించినా ఆన్‌లైన్‌లో చేర్చడం లేదని ఆవేదన వ్యక్తం చేశాడు. గత నాలుగేళ్లుగా కార్యాలయం చుట్టూ తిరిగి వేసారి గత ఏడాది నవంబరు 20 న నంద్యాల కలెక్టరు కార్యాలయంలో స్పందన అర్జీ సమర్పించారు. దీనికి పాణ్యం తహసీల్దారు కార్యాలయం నుంచి గత నెల 18 వతేదీన పరిష్కారమైనట్లు రికార్డుల్లో చూపించి చేతులు దులుపుకున్నారు. కాగా ఆన్‌లైన్‌లో మాత్రం ఎలాంటి సవరణలు జరగకపోవడంతో దిక్కుతోచని పరిస్థితి ఏర్పడినట్లు బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశాడు.


Sub Subject | Entry in Revenue Records
Remarks | Request for entry in revenue records.

Applicant Details

Applicant Name	GANTHI SEKHAR
C/O Name	G.Pullaiah
Gender	MALE
Mobile No	8185868676
Age/DOB	01-JAN-57
Permanent Address	H.No : 4-5 Rachakatta, Habitation : 4-5 Rachakatta, Village : PANYAM3-(R), 11390365, Mandal : Panyam, District : Nandyala
Grievance Address	GS/WS Name : PANYAM3-(R), 11390365, Mandal : Panyam, District : Nandyala

Action History

From : TAHSILDAR, PANYAM
To : -
Action : Redressed
REDRESSED

సమస్య పరిష్కారమైనట్లు చూపిస్తున్న డాక్యుమెంటు

ఎన్నికల పనుల్లో బిజీ: తమ్మరాజుపల్లెలోని 92/2 సర్వే నెంబరులోని 2.73 ఎకరాల ప్రైవేటు భూమిని ప్రభుత్వ నిషేధిత జాబితాలో చేర్చారు. దీంతో గ్రామానికి చెందిన రాములమ్మ అనే మహిళ స్థానిక తహసీల్దారు కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. అధికారులు రికార్డులు పరిశీలించి సర్వే రిపోర్టును నంద్యాల ఆర్డీవో కార్యాలయానికి పంపారు. అనంతరం జిల్లాలు విడిపోవడంతో జాప్యం ఏర్పడింది. బాధితురాలు ఆర్డీవో కార్యాలయానికి వెళ్లి సమస్యను వివరించగా ప్రస్తుతం కార్యాలయంలో సంబంధిత అధికారి అందుబాటులో లేడని, ఇప్పుడు ఎన్నికల సమయం కావడంతో భూముల సమస్యలపై దృష్టిపెట్టడం లేదన్న జవాబు అధికారుల నుంచి రావడంతో దిక్కుతోచని పరిస్థితి ఏర్పడినట్లు బాధితురాలు చెప్పారు. ఐదేళ్లుగా రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా జిల్లాలు మారాయంటూ, సిబ్బంది లేరంటూ ఇప్పుడు ఏకంగా ఎన్నికల సమయంలో భూముల సమస్యలు పట్టించుకోమన్నట్లు వ్యవహరించడంపై అసహనం వ్యక్తం చేశారు. నిషేధిత భూముల జాబితాలో చేర్చడంతో దాదాపు 60 కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు, రిజిస్ట్రేషన్ సమస్యలు ఎదుర్కొంటున్నామని తమ్మరాజుపల్లె గ్రామస్థులు చెబుతున్నారు.

సమస్యను పరిష్కరిస్తాం

చంద్రశేఖర్ సమస్య రీసర్వేతో పూర్తవుతుంది, ఇప్పటి వరకు పాణ్యంలో రీసర్వే ప్రారంభం కాలేదు. స్పందనలో వచ్చిన ఫిర్యాదు మేరకు సమస్యపై విచారించాం. రీసర్వే అనంతరం ఆన్‌లైన్ చేపడతాం

శ్రీనివాసులు, వీఆర్వో, పాణ్యం

'జల సంఘాలు ఏర్పాటు చేసుకోవాలి'

కొత్తపల్లి, ఫిబ్రవరి 17: జల్ జీవన్ మిషన్ పనుల నిర్వహణ కోసం గ్రామ స్థాయిలో జల సంఘాలను ఏర్పాటు చేసుకోవాలని జల్ జీవన్ మిషన్ జిల్లా ప్రాజెక్టు పర్యవేక్షణాధికారి భీమశంకర్ రెడ్డి అన్నారు. శనివారం కొత్తపల్లి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో జవహర్ బాబు అధ్యక్షతన జల్ జీవన్ మిషన్ పనుల నిర్వహణపై అవగాహన సదస్సు జరిగింది. భీమశంకర్ రెడ్డి మాట్లాడుతూ కమ్యూనిటీ కాంట్రాక్టింగ్ పద్ధతిలో పనులను నిర్వహించి ప్రతి ఇంటికి తాగునీటి కొళాయిలను ఏర్పాటు చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. గ్రామీణ జల సంఘాల ఏర్పాటులో భాగంగా 9 మంది డ్వాక్రా సంఘాల మహిళలు సభ్యులుగానూ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కన్వీనర్‌గానూ, పంచాయతీ సెక్రటరీలు ఎక్స్ అఫీసియోగా ఉండి కమిటీలను ఏర్పాటు చేసుకుని జలజీవన్ మిషన్లను నిర్వహించుకోవాలన్నారు. అలాగే ఆయా గ్రామాల సంఘాల బ్యాంకు ఖాతా, జలజీవన్ మిషన్ పర్యవేక్షణ, జలసంఘాల బాధ్యతలపై భీమశంకర్ రెడ్డి వివరించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ త్రిలింగేశ్వరరెడ్డి, ఏపీఎం పుల్లయ్య, ఆయా గ్రామాల పంచాయతీ సెక్రటరీలు ఉన్నారు.

'డిమాండ్లు నెరవేర్చాలి'



ఆత్మకూరులో ర్యాలీ నిర్వహిస్తున్న ఉద్యోగులు

ఆత్మకూరు, ఫిబ్రవరి 17: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల డిమాండ్లను వెంటనే నెరవేర్చాలని ఏపీ జేఏసీ చైర్మన్ సీ.మోహన్‌రెడ్డి, ఏపీఎన్జీవోస్ తాలుకా కార్యదర్శి సాజిద్‌బాషా, ఉపాధ్యాయ సంఘాల నాయకులు కమతం శంకర్, ఉమర్, జనార్దన్‌రావు, ఆర్టీసీ ఉద్యోగ సంఘం నాయకులు ఎంఎం.బాషా, విశ్రాంత ఉద్యోగుల సంఘం తాలుకా అధ్యక్షులు అచ్చయ్య అన్నారు. ఈమేరకు శనివారం ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘం నాయకులతో కలిసి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అలాగే తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు 12 పీఆర్‌సీలో భాగంగా మధ్యంతర భృతి 30శాతం ఇవ్వాలని అన్నారు. అలాగే పెండింగ్‌లో ఉన్న రెండు డీఏలను చెల్లించడంతో పాటు 11వ పీఆర్‌సీ అరియర్స్ సరెండర్ లీవ్, మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులను చెల్లించాలని చెప్పారు. సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేయాలని కోరారు. 70 నుంచి75ఏళ్ల వయస్సు గల పెన్షనర్లకు 10శాతం, ఆపై వయస్సు గల వారికి 15శాతం అడిషనల్ క్వాంటం చెల్లించాలని విజ్ఞప్తి చేశారు, అంతేకాకుండా ఒకటవ తేదిన జీతాలు చెల్లించాలని, అన్ని ఆసుపత్రుల్లో ఈహెచ్ఎస్ కార్డుల ద్వారా నగదు రహిత వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగులకు ఇంటి స్థలం మంజూరు చేయాలని అన్నారు.

'ఆర్ఏఆర్ఎస్ కార్మికులను ఆప్కాస్‌లో చేర్చాలి'

నంద్యాల టౌన్, ఫిబ్రవరి 17: నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో పని చేస్తున్న తమను ఆప్కాస్‌లో చేర్చాలని కాంట్రాక్టు కార్మికులుగా డిమాండ్ చేశారు. ఆర్ఏఆర్ఎస్ కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కారం చేయాలని కోరుతూ శనివారం నుంచి జరుగుతున్న సమ్మెలో భాగంగా కాంట్రాక్టు కార్మికులు ఆర్ఏఆర్ఎస్ ఎదుట నిరసన తెలిపారు. యూనియన్ గౌరవాధ్యక్షుడు లక్ష్మణ్, రాష్ట్ర అధ్యక్షుడు పుల్లయ్యలు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కాంట్రాక్టు కార్మికులు రాష్ట్రంలో లేకుండా చేస్తానని వారందరినీ రెగ్యులర్‌గా చేస్తామని చెప్పిన హామీని నేటికీ నెరవేర్చకపోవడం దుర్మార్గమని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆప్కాస్‌లో కార్మికులందరినీ చేర్చాలని, యూనివర్సిటీ పొలాల్లో పని చేసే సందర్భంగా ఏ ప్రమాదం జరిగినా అధికారులే పూర్తి బాధ్యత వహించాలని అన్నారు. కాంట్రాక్టు కార్మికుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని, అరకొర వేతనాలతో సరిపెట్టడం సరికాదని అన్నారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగులకు సెలవు దినాలు ఇచ్చిన విధంగానే కాంట్రాక్టు కార్మికులకు వేతనాలతో కూడిన సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ నాయకులు, పాల్గొన్నారు.

ఘనంగా ఫార్మా ఉమెన్ లీగ్


ఫార్మా ఉమెన్ లీగ్‌ను ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్

పాణ్యం, ఫిబ్రవరి 17: మహిళా దినోత్సవం సందర్భంగా అసోసియేషన్ ఆఫ్ ఫార్మాస్యూటికల్స్ టీచర్స్ ఆఫ్ ఇండియా, ఏపీ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో శనివారం శాంతిరాం ఫార్మసీ కళాశాలలో 7వ జోన్ ఫార్మా ఉమెన్ లీగ్ నిర్వహించారు. 7వ జోన్ పరిధిలోని కర్నూలు, నంద్యాల, అనంతపురం జిల్లాల ఫార్మసీ కళాశాలల మహిళా టీచర్స్‌కు చెస్, క్యారమ్స్, టెన్నికాయిట్, బ్యాడ్మింటన్ పోటీలను నిర్వహించారు. మహిళలను ఫార్మసీ టీచింగ్ రంగంలో ప్రోత్సహించాలని శాంతిరాం ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మధుసూదన్‌చెట్టి సూచించారు. మహిళలను ఫార్మసీ రంగంలో ప్రోత్సహించి అంతర్జాతీయ స్థాయిలో ఫార్మసీ వృత్తిలో సాధికారత సాధించడమే దీని ముఖ్య ఉద్దేశమన్నారు. ఆర్థిక సహకార పరిశోధనల ద్వారా వృత్తి నైపుణ్యాలను మెరుగుపర్చుకోవాలని సూచించారు. పోటీలలో విజేతలకు ఏపీటీఐ ఈసీ మెంబరు డాక్టర్ రవిప్రకాష్ బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో జోనల్ కోఆర్డినేటర్ త్రివేణి, కోఆర్డినేటర్ మహేశ్వరి, మహిళా అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

బావిలో పడి వ్యక్తి మృతి

జూపాడుబంగ్లా, ఫిబ్రవరి 17: మండలంలోని తరిగోపుల గ్రామంలో ఓ వ్యక్తి బావిలో పడి మృతి చెందాడు. తరిగోపులకు చెందిన రాంపుల్లారెడ్డి(44) అనే వ్యక్తి ఈ నెల 15న నీళ్లు తెచ్చేందుకు వెళ్లి తిరిగి రాలేదు. శనివారం గ్రామ సమీపంలోని పీర్లబావిలో మృతదేహం తేలడంతో గ్రామస్థులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని బయటికి తీయించి పోస్టుమార్టం చేయించారు. మృతునికి భార్య గతంలోనే మృతి చెందింది. దీంతో ఇరిద్దరు పిల్లలు అనాథలయ్యారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ మేరీజయంతి తెలిపారు.

రహదారి గుంతలమయం


గుంతలమయమైన గువ్వలకుంట్ల-పాలెంచెర్వు గూడెం రోడ్డు

కొత్తపల్లి, ఫిబ్రవరి 17: అటవీ ప్రాంతాల్లో నివసిస్తున్న గిరిజనుల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గూడేలా అభివృద్ధి కోసం ఎన్నో పథకాలు చేపడుతున్నామని చెబుతున్నప్పటికీ క్షేత్ర స్థాయిలో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంది. వివరాల్లోకి వెళితే.. కొత్తపల్లి మండలం గువ్వలకుంట్ల మజరా గ్రామమైన పాలెంచెర్వు గూడెం రోడ్డు గుంతలమయమై ఏళ్లు గడుస్తున్నా పాలకులు గానీ, ఏ అధికారి కానీ పట్టించుకున్న పాపాన పోలేదు. ఈ గిరిజన గూడెంలో రూ.కోటికి పైగా నిధులు వెచ్చించి గిరిజన ఆశ్రమ పాఠశాల ఏర్పాటు చేయడంతో నిత్యం ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, గూడెం వాసులు ఈ గుంతలయమైన రోడ్డుపై ప్రయాణిస్తుంటారు. ఈ రహదారి బాగా దెబ్బతినడంతో నిత్యం ద్విచక్ర వాహనాలపై వెళ్లే వారు ప్రమాదానికి గురవుతున్నారు. పీఆర్ ఏఈ రామచంద్రయ్యను వివరణ కోరగా.. ఇప్పటికే బీటీ రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు చెప్పారు. అయితే నిధులు లేకపోవడం వల్ల రహదారి నిర్మాణ పనుల్లో జాప్యం జరుగుతోందన్నారు.

పీహెచ్‌సీ తనిఖీ

● గైర్హాజరైన వైద్యాధికారులు, సిబ్బందికి మెమోలు

మహానంది, ఫిబ్రవరి 17: మహానంది మండలం తిమ్మాపురంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా.వెంకటరమణ శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారు లతోపాటు వైద్య సిబ్బంది విధులకు గైర్హాజరు కావడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇద్దరు వైద్యాధికారులు, ముగ్గురు సిబ్బందికి మెమోలు జారీ చేశారు. అనంతరం గ్రామం సమీపంలోని గిరిజన ప్రాంతానికి చెందిన మేకల అంజనమ్మకు ప్రధానమంత్రి మాతృత్వ వందన యోజన, ఇతర ప్రభుత్వ లబ్ధి కోసం ఆ బాలింతకు బ్యాంకు అకౌంటు లేనందువల్ల ఆర్థిక లబ్ధి అందడం లేదని గ్రహించారు. దీనికోసం ఆయన తిమ్మాపురం లోని ఏపీజీబీ అధికారులతో మాట్లాడి అకౌంటు ఓపెన్ చేయుంచారు. అనంతరం గ్రామంలోని సచివాలయాన్ని పరిశీలించారు. అనంతరం గ్రామంలోని ఆరోగ్యశ్రీ కార్డులను ఆయన పంపిణీ చేశారు. మార్చి 3న జరిగే పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.


రికార్డును పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో డా.వెంకటరమణ

టీఎన్ఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా మురళీమోహన్


అచ్చెన్నాయుడు చేతుల మీదుగా నియామక పత్రాలు అందుకుంటున్న మురళీమోహన్, ఖాజావలి

నందికొట్కూరు ఫిబ్రవరి 17: టీఎన్ఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నందికొట్కూరు మండలం శాతన కోట గ్రామానికి చెందిన మురళీ మోహన్‌ను నియమిస్తూ టీడీపీ జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే తెలుగు యువత జిల్లా అధికార ప్రతినిధిగా జూపాడుబంగ్లా మండలం మండ్లెం గ్రామానికి చెందిన దూదేకుల ఖాజావలిని నియమిస్తూ ఆయన ఉత్తర్వులు జారీ చేశారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు చేతుల మీదుగా నియామక పత్రాలను అందుకున్నారు.

కేసు నమోదు

జూపాడుబంగ్లా, ఫిబ్రవరి 17: ఇమండలంలోని పారుమంచాల గ్రామానికి చెందిన రవిప్రకాశ్ అనే వ్యక్తిపై దాడిచేసి తీవ్రంగా గాయపర్చడమే కాకుండా, కులం పేరుతో దూషించిన ఘటనలో గ్రామానికి చెందిన 9 మందిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ మేరీ జయంతి తెలిపారు. వివరాలివీ.. రవిప్రకాశ్ మోటారు సైకిల్‌పై వెళుతుండగా సునీత కుమారునికి కాలికి తగలించారు. ఈ విషయంలో రవిప్రకాశ్‌కు, సునీతకు మధ్య వాగ్వాదం జరిగింది. మాటామాట పెరగడంతో అక్కడున్న 9 మంది రవిప్రకాశ్‌పై దాడిచేసి కులం పేరుతో దూషించారు. చెప్పారు. ఇదే ఘటనలో మహిళను అసభ్యకరంగా దూషించారని ఫిర్యాదు చేశారు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

పని మీ ఇంట్లో.. జీతం మున్సిపాలిటీలోనా?

● ఎమ్మెల్యే శిల్పా రవి ఆగడాలపై వైసీపీ జడ్పీటీసీ గోకుల్ ఫైర్


ఆధారాలు చూపిస్తూ మాట్లాడుతున్న గోకుల్‌కృష్ణారెడ్డి

నంద్యాల క్రైం, ఫిబ్రవరి 17: నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిశోర్‌రెడ్డి ఇంట్లో పని చేస్తున్న వ్యక్తి మున్సిపాలిటీలో ఎలా జీతం తీసుకుంటారని వైసీపీ రెబల్ జడ్పీటీసీ గోపవరం గోకుల్‌కృష్ణారెడ్డి ప్రశ్నించారు. శనివారం నంద్యాలలోని వైసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో గోకుల్‌రెడ్డి ఎమ్మెల్యే శిల్పా రవిపై సంచలన ఆరోపణలు చేశారు. ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే శిల్పా రవి, ఆయన తండ్రి మాజీ మంత్రి శిల్పా మోహన్‌రెడ్డి మున్సిపాల్టీ వేదికగా అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపించారు. ఎమ్మెల్యే రవి ఇంటి పనిమనిషి అయిన ప్రసాద్‌ను మున్సిపల్ కాంట్రాక్ట్ ఉద్యోగిగా నియమించి ఇంటి పనులకు వినియోగించుకుంటూ మున్సిపాల్టీలో జీతం తీసుకోవడం వాస్తవం కాదా? అని ఆయన ప్రశ్నించారు. అలాగే మహిళా కౌన్సిలర్ భర్త మున్సిపాల్టీలో ప్రభుత్వ ఉద్యోగి కాకపోయినా ఉద్యోగిగా జీతం తీసుకోవడం నిజం కాదా? అని నిలదీశారు. మున్సిపాల్టీలో చాలా మంది శిల్పా సన్నిహితులు ఉద్యోగులుగా చెలామణి అవుతూ ప్రజల సొమ్మును స్వాహా చేస్తున్నారని సాక్ష్యాధారాలతో బట్టబయలు చేశారు. నంద్యాలలోని మున్సిపల్ స్థలాలను కబ్జా చేస్తూ వాటిలో వెంచర్లను వేసి వ్యాపారాలు చేస్తుంది నీ అనుచరులు కాదా? అని నిలదీశారు. ఎస్‌బీఐ కాలనీలో ఉన్న 2.60 ఎకరాల మున్సిపల్ స్థలాన్ని కబ్జా చేసింది నిజం కాదా? అన్నారు. పన్నుల రూపంలో మున్సిపాల్టీకి రూ.కోట్లలో ఆదాయం వస్తుంటే దాన్ని ఎమ్మెల్యే శిల్పా రవి, తన అనుచరులు దుర్వినియోగం చే స్తున్నారని ఆరోపించారు. నంద్యాల మున్సిపాల్టీలో జరుగుతున్న అవినీతిపై తాను ఎంతవరకైనా వెళ్తానని గోకుల్‌రెడ్డి స్పష్టం చేశారు. ఆంజనేయులు గౌడ్, షుకూర్, అమర్నాథరెడ్డి, దస్తగిరి, వినోద్‌కుమార్, శివశంకర్‌రెడ్డి, ఉసేన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'ఉద్యమకారులపై నిర్బంధం తగదు'


నగరి శ్రీనివాసులుకు నోటీసు ఇస్తున్న పోలీసులు

గడివేముల, ఫిబ్రవరి 17: ఉద్యమ నాయకులపై పోలీసుల నిర్బంధం తగదని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నగరి శ్రీనివాసులు అన్నారు. ఏపీసీపీఎస్ ఎంప్లాయిస్ అసోషియేషన్ ఆదివారం విజయవాడలో తలపెట్టిన ఓట్‌ఫర్ ఓపీఎస్ కార్యక్రమంలో పాల్గొనరాదని శనివారం గడివేముల పోలీసులు ఏపీటీఎఫ్ నాయకులు నగరి శ్రీనివాసులుకు నంద్యాలలో, మానపాటి రవి బూజనూరులో నోటీసులు ఇచ్చారు. దీంతో ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పోలీసుల తీరును ఖండించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధస్తానని, సకాలంలో డీఏలు, మెరుగైన పీఆర్‌సీ ఇస్తామని హామీ ఇచ్చారని అన్నారు. అధికారంలోకి వచ్చి నాలుగున్నరేళ్లు దాటిన హామీలు అమలు చేయలేదని అన్నారు. సీపీఎస్ కంటే దుర్మార్గమైన జీపీఎస్ విధానాన్ని తీసుకొచ్చారని ఆరోపించారు. విజయవాడలో జరిగే శాంతియుత ర్యాలీలో పాల్గొనకుండా పోలీసులు నోటీసులు ఇవ్వడం దారుణం అన్నారు.


'టీబీ వ్యాధితో అప్రమత్తంగా ఉండాలి'

గడివేముల, ఫిబ్రవరి 17: టీబీ వ్యాధితో అప్రమత్తంగా ఉండాలని అడిషనల్ డీఎంహెచ్‌వో శారదాబాయి సూచించారు. మండలంలోని వండుట్ల గ్రామంలోని హెల్త్ సెంటర్ శనివారం ఆమె తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ తగిన జాగ్రత్తలు పాటిస్తే క్షయవ్యాధిని పూర్తిగా నయం చేయవచ్చన్నారు. కార్యక్రమంలో ఎస్‌పీఎం సుహాసిని, వైద్యాధికారి చంటి చిన్న మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

'కర్పూరి ఠాగూర్ సేవలు మరువలేనివి'

ఆత్మకూరు, ఫిబ్రవరి 17: బీహార్ మాజీ ముఖ్యమంత్రి, భారతరత్న కర్పూరి ఠాగూర్ సేవలు మరువలేనివని ఆత్మకూరు నాయిబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు శివ పాములేటి అన్నారు. శనివారం కర్పూరి ఠాగూర్ వర్ధంతిని పురస్కరించుకుని ఆత్మకూరులో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఆసంఘం నాయకులు పెద్దస్వాములు, గాలెన్న, అనిల్‌కుమార్, రుద్రప్రసాద్, బోధనం సుబ్బరాయుడు, జనార్దన్, శేఖర్, రమణ తదితరులు ఉన్నారు.

'బీసీలు రాజ్యాధికారం సాధించాలి'


మాట్లాడుతున్న బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శంకర్‌రావు

నంద్యాల (నూనెపల్లె), ఫిబ్రవరి 17: రాష్ట్రంలో బీసీలు రాజ్యాధికారం సాధించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శంకర్‌రావు పిలుపునిచ్చారు. శనివారం బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నంద్యాలలో సమావేశం నిర్వహించారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు నాగశేషు అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి రాష్ట్ర అధ్యక్షుడు శంకర్‌రావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో బీసీలను రాజకీయ పార్టీలు ఓటు బ్యాంకుగా వినియోగించుకొని అధికారంలోకి వచ్చాక బీసీలను అణగదొక్కుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రత్యక్ష రాజకీయాల్లో బీసీలకు సముచిత స్థానం కల్పించాలని చట్టసభల్లో బీసీలకు తగిన రిజర్వేషన్ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ఉచిత హామీలు, ఉచిత పథకాలతో రాష్ట్రాన్ని లూటీ చేస్తూ ప్రజలపై భారం మోపడం రాజకీయ పార్టీలకు తగదన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు ఏకతాటిపై నిలిచి రాజ్యాధికారం వైపు నడవాలని కోరారు. వచ్చే ఎన్నికల్లో బీసీలకు లోక్‌సభ, శాసనసభ స్థానాలను అన్ని పార్టీలు జనాభా ప్రాతిపదికన కేటాయించాలని డిమాండ్ చేశారు. నాయకులు మద్దిలేటి, జగదీష్, రామకృష్ణ, పరమేష్, భరత్, రామిరెడ్డి, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

26న నంద్యాలలో 'జయహో బీసీ' సభ: మల్లెల

నంద్యాల, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 26న నంద్యాలలో జయహో బీసీ సభను తలపెట్టనున్నామని టీడీపీ జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ శనివారం ఓ ప్రకటన ద్వారా తెలియజేశారు. టీడీపీ అధినేత చంద్రబాబు ఆదేశాల మేరకు జిల్లాలో ఆయా నియోజకవర్గాల ఇన్‌చార్జుల ఆధ్వర్యంలో జయహో బీసీ సభలను చేపడుతున్నామని, వీటికి విశేష స్పందన వస్తోందని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న బీసీలతో కలిసి నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి, అన్ని నియోజకవర్గాల ఇన్‌చార్జులు బీసీ జనార్దన్‌రెడ్డి, గౌరు చరిత, గౌరు వెంకటరెడ్డి, భూమా అఖిలప్రియ, బుడ్డా రాజశేఖరరెడ్డి, ఎన్ఎండీ ఫరూక్, ధర్మవరం సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో నంద్యాలలో భారీ బహిరంగ సభను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. ఈ సభకు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్ర, అయ్యన్నపాత్రుడు తదితర బీసీ నాయకులు హాజరవుతున్నారని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న బీసీలు, టీడీపీ శ్రేణులు భారీగా తరలివచ్చి సభను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

ముస్లింల అభ్యున్నతికి కృషి: బుడ్డా


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి

ఆత్మకూరు, ఫిబ్రవరి 17: ఆత్మకూరు ప్రాంతంలో ముస్లింల అభ్యున్నతికి తమ కుటుంబం ఎంతో కృషి చేసినట్లు శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి అన్నారు. ఆత్మకూరు పట్టణంలోని మోమిన్ హుసేన్ సాహేబ్ అంజుమన్ - ఏ - ఖబరస్తాన్ కమిటీ కార్యాలయంలో శనివారం కమిటీ సభ్యులను మాజీ ఎమ్మెల్యే బుడ్డా మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన మాట్లాడుతూ అప్పట్లో పేద ముస్లింలలు వివాహాలు జరుపుకొనేందుకు సరైన వసతులు లేక ముస్లింల అనేక ఇబ్బందులు పడేవారని అన్నారు. ఆసమయంలో తన తండ్రి బుడ్డా వెంగళరెడ్డి సొంత నిధులతో స్థలాన్ని కొనుగోలు చేసి ప్రభుత్వ సహకారంతో షాదీఖానాను నిర్మించినట్లు చెప్పారు. ఆ తర్వాత తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు రూ.2.20కోట్లతో ఆదునిక హంగులతో షాదీఖానా నిర్మాణానికి నిధులు మంజూరు చేయించానని వివరించారు. అంతేకాకుండా సంక్షేమ పథకాల ద్వారా ముస్లింల అభ్యున్నతికి అన్నివిధాలుగా తోడ్పాటునందించడమే కాకుండా అత్యధికంగా ముస్లింలు నివశించే కాలనీలను అభివృద్ధి చేసినట్లు చెప్పారు. ఆయన వెంట శ్రీశైలం ట్రస్టుబోర్డు మాజీ చైర్మన్ వంగాల శివరామిరెడ్డి, మాజీ సర్పంచ్ కంచర్ల గోవిందరెడ్డి, టీడీపీ మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షులు కలీముల్లా, టీడీపీ పట్టణ అధ్యక్షుడు వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శి అబ్దుల్లాపురం బాషా ఉన్నారు.

టీడీపీ నాయకులకు పరామర్శ

ఆత్మకూరు మండలంలోని బాపనంతాపురం గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు శివప్రసాద్ రావు ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడటంతో శనివారం ఆయన్ని మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి పరామర్శించారు. అంతేకాకుండా గ్రామ సర్పంచ్ దరగయ్య ఇటీవల అనారోగ్యం కారణంగా శస్త్రచికిత్స చేయించుకోవడంతో ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. టీడీపీ మండల అధ్యక్షుడు శివప్రసాద్‌రెడ్డి, నాయకులు శివశంకర్ ఉన్నారు.

'రాక్షస పాలనకు అంతం తప్పదు'


వాణాల గ్రామంలో పాల్గొన్న టీడీపీ నాయకులు

పాములపాడు, ఫిబ్రవరి 17: రాష్ట్రంలో రాక్షస పాలనను అంతమొందించడమే లక్ష్యమని, వైసీపీకి గుణపాఠం తప్పదని టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ జయసూర్య అన్నారు. మండలంలోని వాణాల గ్రామంలో శనివారం బాబు ష్యూరిటీ.. భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక టీడీపీ నాయకులు జనార్దన్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, స్వామిరెడ్డి, రమణారెడ్డితో కలసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ వైసీపీ పాలనలో భూకబ్జాలు, రౌడీయిజం, బెదిరింపులు తప్ప ఎక్కడా అభివృద్ధి జరగలేదన్నారు. అభివృద్ధికి చిరునామా చంద్రబాబు అయితే, జగన్ రాష్ట్రాన్ని అప్పుల స్థానంలో నెంబర్‌వన్ చేశారని ఎద్దేవా చేశారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి వస్తే చంద్రబాబు సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తారన్నారు. మహిళలకు నెలకు రూ.1500, విద్యార్థులకు ఏటా రూ.15 వేలు, రైతులకు ఏటా రూ.20 వేలు, ప్రతి కుటుంబానికి ఉచితంగా మూడు వంటగ్యాసు సిలెండర్లు, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం తదితరు పథకాలు అమలు చేస్తారన్నారు. మాండ్ర సురేంద్ర నాథ్‌రెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి, తిమ్మారెడ్డి, చంద్రశేఖర్, గోవిందు, పూసల కృష్ణ, హఫీజ్, నాగార్జునరెడ్డి, ఏసేపు, బషీర్, కోటబాలు, ఆనందరావు, లక్ష్మయ్య, వీరకృష్ణ నాగేశ్వరరావు, నాగరాజు పాల్గొన్నారు.

'నాణ్యతా ప్రమాణాలపై అవగాహన ఉండాలి'


సదస్సులో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ జయచంద్రప్రసాద్

పాణ్యం, ఫిబ్రవరి 17: కొనుగోలు చేసే ప్రతి వస్తువు, తినే ఆహార పదార్థాలు నాణ్యతగా ఉండేలా ఎంచుకోవాలని, అందుకోసం నాణ్యతపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని ఆర్జీఎం ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జయచంద్రప్రసాద్ సూచించారు. శనివారం ఆర్జీఎం కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. భారతీయ నాణ్యతా ప్రమాణాల సంస్థ విజయవాడ శాఖ ఆధ్వర్యంలో స్టాండర్డ్ క్లబ్ ద్వారా విద్యార్థులకు నాణ్యతా ప్రమాణాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. భారత ఆర్థిక వ్యవస్థలో బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్ ప్రాముఖ్యతపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ఎండీ శివరాం, డైరెక్టర్ డాక్టర్ అశోక్‌కుమార్, క్లబ్ మెంబర్లు డాక్టర్ సిద్దారెడ్డి, డీన్ డాక్టర్ రామిరెడ్డి, కిషోర్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

'ఆర్యవైశ్యులు రాజకీయాల్లో రాణించాలి'

నంద్యాల (కల్చరల్), ఫిబ్రవరి 17: ఆర్యవైశ్యులు రాజకీయాల్లో రాణించాలని ఆర్యవైశ్య పరిరక్షణ సమితి సభ్యులు ఖండే శ్యామ్‌సుందర్‌లాల్, బింగుమల్ల శ్యామ్‌సుందర్, భవనాశి నాగమహేష్ అన్నారు. శనివారం నంద్యాల పట్టణంలోని గీతాభవనంలో నూతన ఆర్యవైశ్య పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు సభ్యులు మాట్లాడుతూ ఆర్యవైశ్యులు రాజకీయాలలోకి వస్తే సమర్థుడైన ఆర్యవైశ్యునికే పట్టం కట్టాలన్నారు. దీనికోసం గడప గడప కార్యక్రమంలో భాగంగా ప్రతి ఆర్యవైశ్యుల ఇంటికి వెళ్లి అవగాహన కల్పిస్తామన్నారు. కొత్త సుబ్బయ్య, ఆర్యవైశ్య పరిరక్షణ సమితి సభ్యులు పాల్గొన్నారు.

'తాగునీటి సమస్య పరిష్కరించాలి'

పాములపాడు, ఫిబ్రవరి 17: మండలంలోని మిట్టకందాల గ్రామంలోని తాగునీటి సమస్యను పరిష్కరించాలని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి స్వాములు డిమాండ్ చేశారు. పాములపాడులోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో తాగునీటి సమస్యను పరిష్కరించాలంటూ శనివారం ధర్నా చేపట్టి అధికారులకు వినతి పత్రం అందించారు. వారు మాట్లాడుతూ గ్రామంలోని ఎస్సీ కాలనీలో రెండు నెలల నుంచి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, గుక్కెడు మంచినీటకోసం సమీప పంటపొలాల్లోని బావులు, బోర్లను ఆశ్రయించాల్సిన దుస్థితి నెలకొందని అన్నారు. అధికారులకు పలు మార్లు విన్నవించినా పట్టించు కోవడం లేదని వాపోయారు. కార్యక్రమంలో లింగాల సురేశ్, దేవరాజ్, యేసురాజు, గద్దల సుంకన్న, సుధాకర్, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

రూ.15 లక్షలతో పైకప్పు నిర్మాణం

మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి ఔదార్యం



మద్దిలేటి స్వామి క్షేత్రంలో మెట్ల మార్గానికి పైకప్పు నిర్మాణం

బేతంచెర్ల, ఫిబ్రవరి 17: మండలంలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామ శివారులో వెలసిన లక్ష్మీ మద్దిలేటి స్వామి క్షేత్రంలో వేసవిని దృష్టిలో ఉంచుకుని భక్తుల సౌకర్యార్థం మెట్ల మార్గంలో పైకప్పు నిర్మాణాన్ని పూర్తి చేశారు. బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి రూ.7లక్షల సొంత నిధులతో పైకప్పు చేపట్టారు. బీసీ కుటుంబానికి మద్దిలేటి స్వామి ఇంటి ఇలవేల్పు దైవం. ఈ ఆలయానికి వేసవి కాలంలో లక్షలాది మంది భక్తులు స్వామి వారి దర్శనార్థం వస్తుంటారు. భక్తుల కోసం బీసీ జారా రెడ్డి ఉచిత కూలింగ్ మినరల్ వాటర్ ప్లాంటు వరకు రూ.8 లక్షల సొంత డబ్బులతో మెట్ల మార్గాన్ని నిర్మించారు. అయితే వేసవి కాలంలో మెట్ల మార్గంలో భక్తులు ఎండవేడిమికి ఇబ్బందులు పడుతున్న విషయం బీసీ జనార్దరెడ్డికి దృష్టికి రావడంతో ఆయన వెంటనే స్పందించి తన సొంత నిధులతో పైకప్పు నిర్మాణం చేపట్టారు. మెట్ల మార్గం దేవుని దర్శనానికి సులువుగా ఉండటంతో భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

హోరాహోరీగా కబడ్డీ పోటీలు

బేతంచెర్ల, ఫిబ్రవరి 17: మండలంలోని ఆర్ఎస్ రంగాపురంలో వెలసిన సయ్యద్ షా అల్లాబకాష్ ఉరుసును పురస్కరించుకుని జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఈ కబడ్డీ పోటీలను ఎంపీపీ నాగభూషణం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలంరెడ్డిలు శనివారం ప్రారంభించారు. ఈ పోటీల్లో 22 జట్లు పాల్గొన్నాయి. ఈ పోటీల్లో గెలుపొందిన విజేతలకు మొదటి, రెండో మూడో, నాలుగో వరుసగా బహుమతులు రూ.35 వేలు, రూ.20వేలు, రూ.10వేలు, రూ.6వేలు నగదును అందజేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో దర్గా నిర్వాహకులు ముజావర్ ఇదయతుల్లా, మహేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

వచ్చేది టీడీపీ-జనసేన ప్రభుత్వమే

డోన్(రూరల్), ఫిబ్రవరి 17: రాష్ట్రంలో తెలుగుదేశం, జనసేన పార్టీల కూటమితో ప్రభుత్వం ఏర్పాటు కానుందని డోన్ జనసేన నియోజకవర్గ నాయకులు ఆలా మోహన్ రెడ్డి అన్నారు. టీడీపీ, జనసేన కూటమితో ఏర్పాటై అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేసే సంక్షేమ పథకాలను వివరిస్తూ ముద్రించిన కరపత్రాలను శనివారం జనసేన ఆధ్వర్యంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆలా మోహన్ రెడ్డి మాట్లాడుతూ మూడు రాజధానుల పేరుతో వైసీపీ ప్రభుత్వం మూడు ముక్కలాట ఆడిందని విమర్శించారు. టీడీపీ, జనసేన ప్రభుత్వ కూటమి ఏర్పాటైన వెంటనే అమరావతే రాజధానిగా తిరిగి ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి జరుగుతుందన్నారు. వచ్చే సాధారణ ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వాన్ని ఓడించేందుకు ప్రజలు సిద్ధం అంటున్నారన్నారు.

అభివృద్ధిలో అగ్రగామిగా నిలిపాం: మంత్రి



కొత్తకోటలో డ్రైవింగ్ శిక్షణ కేంద్ర నిర్మాణ పనులను పరిశీలిస్తున్న మంత్రి బుగ్గన

డోన్, ఫిబ్రవరి 17: డోన్ నియోజకవర్గాన్ని అభివృద్ధిలో అగ్రగామిగా నిలిపామని రాష్ట్ర ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి అన్నారు. శనివారం పట్టణ సమీపంలోని నగర వనంలో ఏర్పాటు చేసిన వివిధ అభివృద్ధి పనులను ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, జడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డిలతో కలిసి మంత్రి బుగ్గన ప్రారంభించారు. గుండాల గ్రామంలో రూ.5 కోట్లతో నిర్మించిన టీటీడీ కళ్యాణ మండపాన్ని ఆయన ప్రారంభించారు. కొత్తకోట గ్రామ సమీపంలో రూ.20 కోట్లతో నిర్మిస్తున్న జాతీయ స్థాయి డ్రైవింగ్, పరిశోధన కేంద్ర భవన నిర్మాణ పనులను మంత్రి పరిశీలించారు. అదేవిధంగా ఆవులదొడ్డి గ్రామంలో రోడ్ల నిర్మాణాలను ప్రారంభించారు. కార్యక్రమంలో మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు, ఎంపీపీ రేగటి రాజశేఖర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, జడ్పీటీసీ రాజ్ కుమార్ యాదవ్, సింగిల్ విండో చైర్మన్ తిరుమల్ రెడ్డి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ రామచంద్రుడు పాల్గొన్నారు.

సీఎం జగన్‌ను ఇంటికి సాగనంపండి

కోవెలకుంట్ల , ఫిబ్రవరి 17: సీఎం జగన్‌ను ఇంటికి సాగనంపాలని బనగానపల్లె నియోజకవర్గం కాంగ్రెస్ కోఆర్డినేటర్ గూటంబాలు యాదవ్ అన్నారు. శనివారం కోవెలకుంట్ల పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నంద్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి మద్దిలేటిస్వామితో కలసి విలేఖర్లతో మాట్లాడారు. ఒక్క చాన్సు పేరుతో అధికారంలోకి వచ్చిన జగన్ ప్రజలకు చేసిందేమి లేదన్నారు. కాంగ్రెస్ పీసీసీ అధ్యక్షులు షర్మిలను దూషించడం దారుణమన్నారు. సోషల్ మీడియాలో వ్యక్తిగత దూషణలకు పాల్పడడం సమంజసం కాదన్నారు. కార్యక్రమంలో సత్యం, ఓబులేసు, తదితరులు పాల్గొన్నారు.

జలజీవన్ మిషన్‌పై అవగాహన



మాట్లాడుతున్న హౌసింగ్ డీఈ నాగరాజు

చాగలమర్రి, ఫిబ్రవరి 17: చాగలమర్రిలోని వెలుగు కార్యాలయంలో శనివారం వెలుగు ఏపీఎం నాగమ్మ ఆధ్వర్యంలో జల జీవన్ మిషన్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. హౌసింగ్ డీఈ నాగరాజు మాట్లాడుతూ లబ్ధిదారులు పక్కా గృహాల నిర్మాణాలు వేగవంతం చేసేలా చూడాలని అన్నారు. మార్చిలోపు ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని అన్నారు. నియోజకవర్గంలో 9,513 ఇళ్లు పూర్తి కాగా మరో 2,485 ఇళ్ల నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయని అన్నారు. నియోజకవర్గంలోని లబ్ధిదారులకు రూ.19.65 కోట్ల బిల్లులు మంజూరయ్యాయని తెలిపారు. ఎన్నికలతో నిమిత్తం లేకుండా నిర్మాణాల్లో ఉన్న వారందరికీ బిల్లులు మంజూరవుతాయని తెలిపారు. అలాగే 2,794 కొత్త ఇళ్ల మంజూరుకు ప్రతిపాదనలు పంపించామని అన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జగ్గయ్య మాట్లాడుతూ ఈ ఏడాది చివరి నాటికి జలజీవన్ మిషన్ లక్ష్యం నెరవేర్చాలని, డ్వాక్రా సంఘాల ఆధ్వర్యంలో పనులు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సూర్యనారాయణరెడ్డి, వర్క్ఇన్‌స్పెక్టర్లు, వెలుగు సీసీలు, పొదుపు సంఘ లీడర్లు పాల్గొన్నారు.

అరాచక పాలనను సాగనంపాలి

మాజీ మంత్రి అఖిలప్రియ



చాగలమర్రిలో అఖిలప్రియ సమక్షంలో చేరిన వైసీపీ నాయకులు

నంద్యాల, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): వైసీపీ రాక్షస పాలనను అంతమొందించాలని మాజీ మంత్రి అఖిలప్రియ పిలుపునిచ్చారు. ఆళ్లగడ్డ పట్టణంలోని సీఎస్ఐ చర్చి ఎదురుగా ఉన్న యాదవుల వీధిలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఇందులో భాగంగా ఆమె ఇంటింటికీ వెళ్లి వైసీపీ పాలనలో ఎదుర్కొంటున్న ఇబ్బందులను, రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో భార్గవ్ రామ్‌నాయుడు, కౌన్సిలర్ హుసేన్‌బాషా, టీడీపీ మహిళా కార్యకర్తలు నూర్జహాన్, రమిజా, సుబహని, అట్ల శ్రీదేవి, పూజిత, భాస్కర్, శివ పాల్గొన్నారు.

● ఆళ్లగడ్డ మున్సిపాల్టీ పరిధిలోని పడకండ్ల గ్రామంలో టీడీపీ యువ నాయకుడు భూమా విఖ్యాత్‌రెడ్డి ఇంటింటి ప్రచారాన్ని శనివారం నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో టీడీపీని అధిక మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. వైసీపీ పాలనతో ఎంతో నష్టపోయామని చెప్పారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ చాంద్‌బాషా, మాజీ కౌన్సిలర్ శూలం నరసింహుడు, చింతకుంట రాంశేఖర్‌రెడ్డి, మద్దిలేటి. రామ్‌మద్దిలేటిరెడ్డి, నగిలి శ్రీనివాసరెడ్డి, ఆవుల రామ్మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైసీపీకి పతనం తప్పదు

చాగలమర్రి, ఫిబ్రవరి 17: రాష్ట్రంలో వైసీపీ అరాచక పాలనకు పతనం తప్పదని మాజీ మంత్రి భూమా అఖిలప్రియ అన్నారు. శనివారం చాగలమర్రి గ్రామంలోని ముత్యాలపాడు బస్టాండు సమీపంలో 40 కుటుంబాలు వైసీపీ నుంచి మాజీ మంత్రి సమక్షంలో టీడీపీలో చేరాయి. గ్రామంలోని 2వ వార్డు సభ్యురాలు బషీరూన్‌తోపాటు కరీముల్లా, ఖాదర్, హుస్సూరుబాషా, పెద్దబాషా, చిన్నబాషా, ఆవుల సాలమ్మ, శ్రీదేవి, సుంకమ్మలతో పాటు 40 కుటుంబాలు టీడీపీలో చేరాయి. వారికి కండువాలు కప్పి అఖిలప్రియ పార్టీలోకి ఆహ్వానించారు. ఆమె మాట్లాడుతూ తమపై నమ్మి వచ్చిన వారికి ఎల్లవేళలా అండగా ఉంటామని తెలిపారు. నియోజకవర్గంలోని మేజర్ పంచాయతీలో ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయని అన్నారు. వీటిని ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. రాష్ట్రాభివృద్ధి టీడీపీతోనే సాధ్యమని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు భార్గవ్‌రామ్, గోగిశెట్టి నరసింహారావు, మండల కన్వీనర్ నరసింహారెడ్డి, టీడీపీ మైనార్టీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అన్సర్‌బాషా, బీసీసెల్ నంద్యాల స్పోక్‌పర్సన్ సల్లానాగరాజు, టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి గుత్తి నరసింహులు, టీడీపీ నాయకులు కొలిమి ఉసేన్‌వలి, కొలిమి షరీఫ్, మౌలాలి, అనిఫ్, ముల్లా అబ్దుల్లా, ముల్లా శ్యాబుల్, అజిమ్, గఫార్, నూర్‌బాష, నాగూర్‌వలి, జెట్టి నాగరాజు, ఖలీల్, శేఖర్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, మోహన్, బ్రహ్మం, నర్సిరెడ్డి, బషీర్, అబ్దుల్ ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుకు పట్టం కట్టడం ఖాయం

● టీడీపీ డోన్ ఇన్‌చార్జి ధర్మవరం సుబ్బారెడ్డి



డోన్‌లో టీడీపీ మెనిఫెస్టో కరపత్రాలు పంపిణీ చేస్తున్న సుబ్బారెడ్డి

డోన్, ఫిబ్రవరి 17: టీడీపీ అధినేత చంద్రబాబుకు పట్టం కట్టడానికి రాష్ట్ర ప్రజలు సిద్ధంగా ఉన్నారని టీడీపీ డోన్ ఇన్‌చార్జి ధర్మవరం సుబ్బారెడ్డి అన్నారు. శనివారం సాయంత్రం పట్టణంలోని శ్రీరామ థియేటర్, కొత్తపేట ప్రాంతాల్లో టీడీపీ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించి మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. సుబ్బారెడ్డి మాట్లాడుతూ సీఎం జగన్ పాలనలో రాష్ట్రం సర్వనాశనమైందని మండిపడ్డారు. అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేసి నియంత పాలన సాగించి ప్రజలకు తీరని నష్టం కలిగించారన్నారు. నిరుద్యోగ యువతను వైసీపీ ప్రభుత్వం దారుణంగా మోసం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు హడావుడిగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయడం నిరుద్యోగులను వంచించడం కాదా అని ప్రశ్నించారు. రాష్ట్రం మళ్లీ అభివృద్ధి చెందాలన్నా, నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు రావాలన్నా చంద్రబాబును ముఖ్యమంత్రిగా చేసుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వలసల రామకృష్ణ, పట్టణ అధ్యక్షుడు సీఎం శ్రీనివాసులు, మండల అధ్యక్షుడు శ్రీనివాసులు యాదవ్, ఆలా మల్లికార్జున రెడ్డి, అభిరెడ్డి పల్లె గోవిందు, రాముడు, ఎస్ఎండీ రఫి, కుమ్మరి సుధాకర్, ఎల్ఐసీ శ్రీరాములు, మధుసూదన్ రెడ్డి, కొచ్చెర్వు రామాంజనేయులు పాల్గొన్నారు.

పెండింగ్ బకాయిలను చెల్లించాలి: జేఏసీ



మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డికి వినతి పత్రం ఇస్తున్న యూటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం నాయకులు

బనగానపల్లె, ఫిబ్రవరి 17: ప్రభుత్వ ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని యూటీఎఫ్ జిల్లా సహాధ్యక్షుడు సత్యప్రకాశ్, మండల యూటీఎఫ్ అధ్యక్షుడు ప్రతాప్ డిమాండ్ చేశారు. పాతపెన్షన్ విధానం అమలు చేయాలని కోరుతూ బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే బీసీజనార్దన్‌రెడ్డికి శనివారం వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం మొండి వైఖరి వీడి ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు సంబంధించిన పెండింగ్‌లో ఉన్న డీఏ, ఐఆర్, జీపీఎఫ్‌తో పాటు సరెండర్ లీవ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని అన్నారు. లేక పోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. జిల్లా కౌన్సిలర్ నాగరాజు, సతీశ్‌కుమార్, మనోహర్, పుల్లయ్య, పూజారి శ్రీనివాసులు, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

● ఉద్యోగ, ఉపాధ్యాయ కార్మికపెన్షనర్ల ఆర్థిక, ఆర్థికేతర సమస్యల సాధనకై ఏపీజేఏసీ రాష్ట్ర కమిటీ తలపెట్టిన తాలూకాస్థాయి ధర్నా కార్యక్రమం బనగానపల్లె తహసీల్దారు కార్యాలయం ఎదుట ఏపీ ఎన్‌జీవో బనగానపల్లె తాలూకా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో శనివారంనిర్వహించారు. ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మాధవస్వామి మాట్లాడుతూ గత 5 ఏళ్లగా ఉపాధ్యాయ, ఉద్యోగ,కార్మిక, పెన్షర్లు దీర్ఘకాలిక పెండింగ్‌లో ఉన్న బకాయిలు, సమస్యల సాధన కొరకు తాలూకాస్థాయి ధర్నా నిర్వహించామన్నారు. కార్యక్రమంలో బాలస్వామి,భద్రావతి,సుబ్రమణ్యం, అనిల్‌కుమార్, వెంకటకృష్ణుడు, ప్రతాప్, దస్తగిరి, వీరన్న, బాలాజీనాయక్,మోహన్‌రెడ్డి, గురునాథం, బ్రహ్మయ్య, సుందరం తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీయూ నాయకులకు నోటీసులు జారీ

చాగలమర్రి, ఫిబ్రవరి 17: సీపీఎస్ రద్దు కోసం 18న చేపట్టే చలో విజయవాడ ధర్నా కార్యక్రమానికి వెళ్లనివ్వకుండా ముందస్తుగా పోలీసులు ఎస్టీయూ నాయకులకు నోటీసులు అందజేశారు. ఎస్టీయూ మండల అధ్యక్షుడు మస్తాన్‌వలి, రాష్ట్ర కౌన్సిలర్లు శివశంకర్, ప్రసాదులతోపాటు ఆయా సంఘ నాయకులకు నోటీసులు ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి అనుమతి ఇవ్వలేదని, ధర్నాకు వెళ్లరాదని పోలీసులు నోటీసులు ఇచ్చారు. ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించకుండా ముందస్తుగా నోటీసులు ఇవ్వడం దారుణమని ఆ సంఘ నాయకులు శివశంకర్, ప్రసాదు ఆరోపించారు. పెండింగ్ బకాయిలను చెల్లించాలని, సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు.

రెండు గడ్డి వాములు దగ్ధం



దగ్ధమవుతున్న గడ్డివాములు

దొర్నిపాడు, ఫిబ్రవరి 17: మండలంలోని భాగ్యనగరం గ్రామంలో శనివారం ప్రమాదవశాత్తు రెండు గడ్డి వాములు దగ్ధమయ్యాయి. అదే గ్రామానికి చెందిన సాయికుమార్‌రెడ్డి, సాయి పవన్ కుమార్‌రెడ్డిలకు చెందిన రెండు గడ్డివాములు ప్రమాదవశాత్తు శనివారం మధ్యాహ్నం కాలడంతో చుట్టుపక్కల ప్రజలు గమనించి ఆళ్లగడ్డ అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో అగ్నిమాపక దళం వచ్చి మంటలను అదుపు చేశారు. రూ..2 లక్షల చొప్పున నష్టం వాటిల్లిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

రుద్రవరం, ఫిబ్రవరి 17 : యల్లావత్తుల సబ్‌స్టేషన్ పరిధిలోని కోటకొండ, కొత్తూరు గ్రామాలకు చెందిన ఫీడరు పరిధిలో విద్యుత్ సరఫరా అంతరాయం ఉంటుందని శనివారం ఏఈ రాఘవేంద్రరెడ్డి తెలిపారు. కొత్త బ్రేకరు ఏర్పాటు చేస్తున్నందు వల్ల ఐదు రోజులపాటు అంతరాయం కలుగుతుందని తెలిపారు. రైతులు సహకరించాలని కోరారు.

విద్యార్థిని అదృశ్యం.. కేసు నమోదు..

బేతంచెర్ల, ఫిబ్రవరి 17: మండలంలోని సిమెంటునగర్ గ్రామానికి చెందిన షూకూరు కుమార్తె నస్రీన్ అనే విద్యార్థిని అదృశ్యమైన కేసు నమోదైనట్లు ఏఎస్ఐ లింగమయ్య శనివారం తెలిపారు. గ్రామానికి చెందిన నస్రీన్ అనే విద్యార్థిని బేతంచెర్ల పట్టణంలోని జూనియర్ కళాశాలకు వెళ్తున్నానని తల్లిదండ్రులకు చెప్పి శుక్రవారం ఇంటి నుంచి మధ్యాహ్నం 11 గంటలకు వెళ్లింది. సాయంత్రమైనా ఇంటికి తిరిగి రాలేదు. నస్రీన్ ఆచూకీ కోసం వెతికినా కనిపించకపోవడంతో బాలిక తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ లింగమయ్య తెలిపారు.

రేపు నరసింహ స్వామి గ్రామోత్సవం



మూడురాళ్లలపల్లెలో విగ్రహాలను ఊరేగిస్తున్న ప్రజలు

చాగలమర్రి, ఫిబ్రవరి 17: చాగలమర్రిలోని చెన్నకేశవ ఆలయంలో అహోబిల లక్ష్మీ నరసింహ స్వామి మాలధారుల ఆధ్వర్యంలో 19న నరసింహ స్వామి గ్రామోత్సవం నిర్వహిస్తున్నట్లు కమిటీ అధ్యక్షుడు గుత్తి నరసింహులు తెలిపారు. పల్లకిలో నరసింహస్వామిని కొలువుదీరింప చేసి చెన్నకేశవ ఆలయం నుంచి ప్రధాన రహదారుల్లో ఊరేగింపు చేస్తామని అన్నారు.

● చాగలమర్రిలోని గాంధీ బజార్‌లోగల వీరాంజనేయస్వామికి వేద పండితుడు ప్రతాప్‌శర్మ ఆధ్వర్యంలో శనివారం విశేష పూజలు చేశారు. మహిళలు తమలపాకులతో ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మహిళలు భజన కార్యక్రమాలు నిర్వహించారు.

● మండలంలోని మూడురాళ్లపల్లె గ్రామంలో వెంకటేశ్వర, సాయిబాబా, వీరభద్ర, ఆంజనేయస్వామి నూతన ఆలయాల ధ్వజ ప్రతిష్ఠ మహోత్సవం సందర్భంగా శనివారం వేద పండితులు పెద్దశాస్త్రీ ఆధ్వర్యంలో గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు.

● మండలంలోని నక్కలదిన్నె గ్రామంలో పార్వేట పల్లకీలో కొలువుదీరిన జ్వాలా నరసింహస్వామి, ప్రహ్లాద వరద స్వాములకు శనివారం ప్రత్యేక పూజలు చేశారు. నరసింహా.. గోవిందా.. అంటూ నామస్మరణం చేస్తూ పల్లకి వద్దకు మేళతాళాలతో చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు.

లక్ష కుంకుమార్చన



స్వామి,అమ్మవార్లకు పూజలు

రుద్రవరం, ఫిబ్రవరి 17 : మండలంలోని వాసాపురం వెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు వారణాసి గోపిశర్మ అభిషేకం చేసి వేదమంత్రోచ్చారణల మధ్య పూజలు ప్రారంభించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. వెంకటేశ్వర స్వామి ఆలయంలో లక్ష కుంకుమార్చన చేసి స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు.

● మండలంలోని నరసాపురం, రుద్రవరం నరసింహస్వామి ఆలయాల్లో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు అభిషేకం చేసి పూజలు ప్రారంభించారు. భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకుని పూజలు చేశారు.

పంట నమోదు పొడిగింపు

చాగలమర్రి, ఫిబ్రవరి 17: మండలంలో రబీ సీజన్‌లో సాగు చేసిన వివిధ పంటల నమోదు కార్యక్రమాన్ని 19వ తేదీ వరకు పొడిగించినట్లు ఏవో రంగనేతాజీ సూచించారు. శనివారం మల్లేవేముల, గొట్లూరు, రాజోలి గ్రామాల్లో వ్యవసాయ సిబ్బంది చేస్తున్న ఈక్రాప్ నమోదును పరిశీలించారు. ఇప్పటి వరకు 90 శాతం మాత్రమే పంట నమోదు జరిగిందని, మిగిలిన పది శాతం కూడా నమోదు చేయాలని అన్నారు. రైతులు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించాలని అన్నారు.

టీడీపీతోనే బీసీల సాధికారత

చాగలమర్రి, ఫిబ్రవరి 17: రాష్ట్రంలో టీడీపీతోనే బీసీల సాధికారత సాధ్యమవుతుందని మండల బీసీ సంఘం అధ్యక్షుడు లక్ష్మీనారాయణగౌడ్, సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మహబూబ్‌బాషా తెలిపారు. శనివారం బీసీ సంఘం కార్యాలయంలో వారు మాట్లాడుతూ టీడీపీతోనే బీసీల సంక్షేమం సాధ్యమవుతుందని అన్నారు. వైసీపీ ప్రభుత్వంలో బీసీ కార్పొరేషన్ నిధులు నిర్వీర్యం చేశారని అన్నారు. వైసీపీ అరాచక పాలనకు ఎన్నికల్లో ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని అన్నారు.

పోస్టల్ పథకాలను సద్వినియోగం చేసుకోండి



మిట్టపల్లెలో ర్యాలీ చేస్తున్న పోస్టల్ సిబ్బంది

నంద్యాల, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లోని ప్రజలకు పోస్టల్ శాఖ అందిస్తున్న పథకాలపై అవగాహన కల్పించినట్లు పోస్టల్ ఇన్‌స్పెక్టర్ ఎ.చంద్రమౌళీశ్వరరెడ్డి చెప్పారు. మండలంలోని మిట్టపల్లె గ్రామంలో శనివారం పోస్టల్ సిబ్బంది పోస్టల్ శాఖ కల్పిస్తున్న పథకాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. గ్రామంలోని ప్రతి మనిషి పోస్టల్ ఖాతా తెరవాలని, ఆడపిల్లల కోసం సుకన్య సమృద్ధి యోజన పథకం వరమని చెప్పారు. కార్యక్రమంలో భాస్కరరావు, పెద్దరాజు, సుబ్రహ్మణ్యం, జాఫర్, నరసింహారావు, నాగేంద్ర, బాలన్న తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో పని చేద్దాం

నంద్యాల, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించుకునేందుకు సమన్వయంతో పని చేద్దామని నంద్యాల ఆర్డీవో మల్లికార్జునరెడ్డి సూచించారు. తహసీల్దార్ కార్యాలయంలో శనివారం ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని ఆరు మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎస్ఐలు, సీఐలతో శనివారం సమావేశం నిర్వహించారు. ఎన్నికల్లో భాగంగా పోలింగ్ స్టేషన్లను, సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక గ్రామాలపై నిఘా ఉంచాలని కోరారు. అనంతరం వైపీపీఎం కళాశాలలో ఏర్పాటు చేయనున్న స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలించారు.

ఎడాపెడా విద్యుత్ కోతలు



నీరు లేక నెర్రెలు చీలిన నేల

బనగానపల్లె, ఫిబ్రవరి 17: బనగానపల్లె మండలంలో విద్యుత్ కోతలు ఎడాపెడా విధిస్తున్నారు. దీంతో ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలన్నీ ఎండుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం 9 గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నామని చెబుతున్నా ఎక్కడా కూడా విద్యుత్ సరఫరా చేయడం లేదని హుసేనాపురం గ్రామ రైతులు వాపోతున్నారు. ఫిబ్రవరిలోనే ఎండలు మండుతుండడంతో వరి పంటకు నీరు లేక ఎర్రబారుతుందన్నారు. మొక్కజొన్న పంట పూర్తిగా ఎండిపోతున్నాయి. విద్యుత్ అధికారులను ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా రైతులు విద్యుత్‌ను హుసేనాపురం ఫీడర్‌కు 9గంటలువిద్యుత్ సరఫరా చేసి అన్నదాతలను ఆదుకోవాలని కోరుతున్నారు.

ముగిసిన బండలాగుడు పోటీలు



బండ లాగుతున్న ఎద్దులు

బేతంచెర్ల, ఫిబ్రవరి 17: మండలంలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామంలో వెలసిన సయ్యద్‌షా అల్లాబకాష్ ఉరుసును పురస్కరించుకుని రైతు సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి బండలాగుడు పోటీల్లో కర్నూలు జిల్లా రుద్రవరం ఎద్దులు ప్రథమ విజేతగా నిలిచాయి. ఈ బండలాగుడు పోటీలను ఎంపిపీ నాగభూషణం రెడ్డి, చైర్మన్ చలంరెడ్డిలు శనివారం ప్రారంభించారు. ఈ బండలాగుడు పోటీల్లో 8 జతల ఎద్దులు పాల్గొనగా.. వాటిలో కర్నూలు జిల్లా పి.రుద్రవరం గ్రామానికి చెందిన ఎల్లగౌడు ఎద్దులు ప్రథమ బహుమతి రూ.20వేలు, ఓర్వకల్లు మండలం ఉయ్యాలవాడ గ్రామానికి చెందిన సుధాకర్ ఎద్దులకు రెండో బహుమతి రూ.10వేలు, క్రిష్ణగిరి మండలం అలవకొండ గ్రామానికి చెందిన మునిరంగడు యాదవ్ ఎద్దులకు మూడో బహుమతి రూ.5వేలు నగదును రైతు సంఘం నాయకులు ఎద్దుల యజమానులకు ప్రదానం చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు మహేశ్వరరెడ్డి, ఎద్దుల యజమానులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెరగాలి

రుద్రవరం, ఫిబ్రవరి 17 : ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రసవాల సంఖ్య పెరగాలని నేషనల్ అండ్ హెల్త్ మిషన్ ప్రోగ్రాం ఆఫీసర్ సునీత అన్నారు. శనివారం మండలంలోని నరసాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి రికార్డులు పరిశీలించారు. రోగులకు వైద్య సేవలు ఎలా అందుతున్నాయని అడిగి తెలుసుకున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రజలకు సకాలంలో వైద్య సేవలు అందించాలని సూచించారు. ఆరోగ్య కార్డులు ప్రధానమంత్రి జనరల్ ఆరోగ్య యోజన కార్డులు వీలైనంత త్వరగా ప్రజలకందించాలన్నారు. గ్రామాల్లో వైద్యసిబ్బందితో ఆరోగ్య క్యాంపులు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ జగదీష్‌చంద్రరెడ్డి, వైద్యాధికారి బాబు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

రాక్షస పాలనకు చరమగీతం పాడండి



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకుడు తులసిరెడ్డి

నంద్యాల, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి: రాష్ట్రంలోని వైసీపీ రాక్షసపాలనకు చరమగీతం పాడాలని కాంగ్రెస్ పార్టీ నాయకుడు తులసిరెడ్డి పిలుపునిచ్చారు. ఆళ్లగడ్డ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ నాయకుడు బరగొడ్ల హుసేన్‌బాషా ఆధ్వర్యంలో శనివారం జరిగిన కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ బలం పుంజుకుంటున్నదని, రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వచ్చే అవకాశాలు లేకపోలేదన్నారు. దేశంలో రాహుల్‌గాంధీ ప్రధానమంత్రి అవుతారని అన్నారు. కార్యక్రమంలో సంజీవకుమార్, పాపాజి, లక్ష్మీనరసింహుడు, మహబూబ్‌బాషా పాల్గొన్నారు.

రాజధాని ఫైల్స్ సినిమాతో వైసీపీకి వణుకు

● టీడీపీ డోన్ ఇన్‌చార్జి ధర్మవరం సుబ్బారెడ్డి



డోన్‌లో రాజధాని ఫైల్స్ సినిమాను వీక్షిస్తున్న సుబ్బారెడ్డి

డోన్, ఫిబ్రవరి 17: రాజధాని ఫైల్స్ సినిమాతో వైసీపీ వెన్నులో వణుకు పుడుతోందని టీడీపీ డోన్ ఇన్‌చార్జి ధర్మవరం సుబ్బారెడ్డి అన్నారు. శనివారం రాత్రి పట్టణంలోని శ్రీరామ థియేటర్‌లో రాజధాని ఫైల్స్ సినిమాను సుబ్బారెడ్డితో పాటు టీడీపీ నాయకులు, కార్యకర్తలు షోను తిలకించారు. సీఎం జగన్ చేస్తున్న అరాచక పాలనను, దోపిడీని కళ్లకు కట్టినట్లు చూపించారని సుబ్బారెడ్డి అన్నారు. పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలి వచ్చి సినిమాను ఎంతో ఆసక్తిగా వీక్షించారు.

నిందితులను అరెస్టు చేయాలి

డోన్(రూరల్), ఫిబ్రవరి 17: డోన్ నియోజకవర్గంలోని ప్యాపిలి మండలం గార్లదిన్నె గ్రామంలో దళితుడు వీరయ్య మాదిగపై దాడి చేసిన నిందితులను అరెస్టు చేయాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సాధన సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొందిమడుగుల రమేష్ మాదిగ డిమాండ్ చేశారు. శనివారం సాయంత్రం డోన్ పట్టణంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 13న గార్లదిన్నె గ్రామంలో రామాలయ ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమంలో భాగంగా జరిగిన ఊరేగింపులో దళితుడు వీరయ్య మాదిగ డ్యాన్స్ చేయడాన్ని జీర్ణించుకోలేని కొంత మంది అతనిపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచారని ఆరోపించారు. వీటిపై పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైందని, నిందితులను అరెస్టు చేసి బాధితునికి న్యాయం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మాదిగ రిజర్వేషన్ పోరాట సాధన సమితి కర్నూలు, నంద్యాల జిల్లా నాయకులు శ్రీనివాసులు, గిడ్డయ్య మాదిగ పాల్గొన్నారు.

మద్దిలేటి స్వామి క్షేత్ర ఆదాయం రూ.4.27 లక్షలు

బేతంచెర్ల, ఫిబ్రవరి 17: మద్దిలేటి నరసింహస్వామి క్షేత్ర ఆదాయం రూ.4.27 లక్షలు సమకూరినట్లు ఈవో రామాంజనేయులు చైర్మన్ సీతారామచంద్రుడు శనివారం తెలిపారు. భక్తులు వేకువజాము నుంచే స్వామి అమ్మవార్లకు అభిషేకాలు, గండ దీపాలు, ప్రత్యేక పూజలు చేసి పుట్టు వెంట్రుకలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. స్వామి సేవా టికెట్లు, లడ్డూ ప్రసాదం, కేశ ఖండన, రూము బాడుగలు, లీజుల వసూళ్ల ద్వారా రూ.4,27,652 దేవస్థానానికి ఆదాయం లభించినట్లు వారు తెలిపారు.

ఘనంగా అల్లాబకాష్ ఉరుసు

బేతంచెర్ల, ఫిబ్రవరి 17: మత సామరస్యానికి ప్రతీకగా హిందూ ముస్లింలు భక్తిశ్రద్ధలతో మండలంలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామంలో వెలసిన సయ్యద్‌షా అల్లాబకాష్ ఉరుసు అత్యంత వైభవంగా శనివారం నిర్వహించారు. భక్తులు అల్లాబకాష్ స్వాముల వారికి భక్తిశ్రద్ధలతో ఫతేహాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ ప్రియతమ్ రెడ్డి ఆధ్వర్యంలో ఎస్ఐ శివశంకర్ నాయక్ సిబ్బందిత గట్టి పోలీసు బందోబస్తు నిర్వహించారు.